విద్యారంగ సమస్యలా?

- టెట్ పరీక్షార్థులకు ఇబ్బందులున్నాయా?
- రేపు డయల్ యువర్ డీఈవో

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో విద్యారంగ పరంగా ఏమైనా సమస్యలున్నాయా? పాఠశాలల్లో కనీస సదుపాయాలు లేవా? విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాలు, స్కూలు బ్యాగులు, ఏకరూప దుస్తులు తదితర వస్తువుల్లో నాణ్యత లోపించిందా? విద్యార్థుల సంఖ్యకు తగినంత మంది ఉపాధ్యాయులు లేరా? ప్రైవేటు పాఠశాలల్లో అధిక రుసుములు వసూలు చేస్తున్నారా? నిబంధనలు పాటించడం లేదా? అక్టోబరు 3 నుంచి 21 వరకు నిర్వహించనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష-టెట్‌కు సంబంధించి అభ్యర్థులకు ఏమైనా ఇబ్బందులున్నాయా? హాల్ టికెట్లలో తప్పిదాలు దొర్లాయా? ఒకేరోజు వేర్వేరుచోట్ల పరీక్ష కేంద్రాలు కేటాయించారా? ప్రభుత్వ బడుల్లో ఇటీవల నిర్వహించిన పని సర్దుబాటులో ఎక్కడైనా లోపాలు తలెత్తాయా? ఇటువంటి సమస్యలన్నీ నేరుగా జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని 'ఈనాడు' కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా ఫోన్ కాల్ మాత్రమే.



అబ్రహం

తేదీ: 28.9.24 శనివారం	సమయం: ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య	చరవాణి సంఖ్య: 88867 76799



ఉత్సాహంగా క్రీడా పోటీలు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉంగుటూరు మండలం కైకరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు.

ఈనాడు, ఉంగుటూరు

రుణమాయ

ఈనాడు, ఏలూరు

బ్యాంకులో రుణాల కోసం కొందరు అడ్డదారులు తొక్కుతున్నారు. సంబంధం లేని భూములు, చెరువులను తామే సాగు చేస్తున్నట్లు తప్పుడు పత్రాలు సమర్పించి భారీగా రుణాలు తీసుకుంటున్నారు. కొందరు అధికారులు ఈ వ్యవహారాల్లో భారీగా ముడుపులు మెక్కేసి అడ్డగోలుగా రుణాలిచ్చేస్తున్నారు. ఫలితంగా నిజమైన యజమానులు అవస్థలు పడుతున్నారు.



- నకిలీ కౌలు పత్రాలతో కుంభకోణాలు
- బ్యాంకు అధికారుల సహకారంతోనే వ్యవహారం

- ఏలూరు పరిధిలోని సత్రంపాడుకు చెందిన పాలడుగు వెంకటేశ్వరరావు, ఆయన భార్య పేరు మీద పెంటపాడు, ఉంగుటూరు, రావులపర్రు గ్రామాల్లో 9.37 ఎకరాల చేపల చెరువులున్నాయి. 2016 నుంచి వారే సాగుదారులు. దెందులూరు మండలానికి చెందిన ఓ వ్యక్తి ఆ చెరువులను లీజుకు తీసుకుని సాగు చేస్తున్నట్లు తప్పుడు పత్రాలు సృష్టించారు. వాటిని ఏలూరు గ్రామీణ పరిధిలోని ఓ బ్యాంకులో పెట్టి రూ.12 లక్షల రుణం తీసుకున్నారు. వారం కిందట యజమాని రుణం తీసుకొనేందుకు బ్యాంకుకు వెళ్లగా ఈ చెరువులపై రుణం ఉందని చెప్పటంతో అవాక్కయ్యారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.
- మండవల్లి మండలానికి చెందిన ఓ లేఖరి కొంత కాలం కిందట భారీ కుంభకోణం చేశారు. బ్యాంకు అధికారులకు ముడుపులు సమర్పించి భారీగా రుణం పొందారు. తన దగ్గరకు రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన విలువైన ఆస్తి పత్రాలను కలర్ జిరాక్స్ తీశారు. బ్యాంకు అధికారుల సహకారంతో దాన్ని బ్యాంకులో పెట్టి రూ.50 లక్షలు రుణం పొందారు. కొంతకాలానికి యజమాని రుణం కోసం వెళ్తే అసలు విషయం బయటపడింది.
- గతంలో భీమవరానికి చెందిన కొందరు కృష్ణా జిల్లాలో పొలాలను తాము లీజుకు తీసుకున్నట్లు నకిలీ లీజు పత్రాలు సృష్టించారు. అక్కడ బ్యాంకుల్లో పెద్దఎత్తున రుణాలు తీసుకున్నారు. తిరిగి చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు యజమానులకు నోటీసులు పంపారు. దీంతో అసలు కుంభకోణం బయటపడింది.

అంతా అడ్డదారిలోనే..

సాధారణంగా బ్యాంకుల్లో రుణం ఇవ్వాలంటే తీసుకునేవారి ఆస్తి పత్రాలు తనఖా పెట్టుకుంటారు. చేపలు, రొయ్యల చెరువులు, పెద్ద వ్యాపారాలు చేస్తున్నట్లు చూపిస్తే ఆ పెట్టుబడుల స్థాయిని బట్టి రుణం మంజూరవుతుంది. ఉమ్మడి జిల్లాలో ఆక్వా రైతులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పెట్టుబడుల కోసం కొంత మంది అడ్డదారులు తొక్కుతున్నారు. చెరువుల యజమానులు కౌలుకు ఇవ్వకుండానే ఇచ్చినట్లు నకిలీ పత్రాలు సృష్టిస్తున్నారు. సంతకాలు సైతం ఫోర్జరీ చేస్తున్నారు. వాటిని బ్యాంకులో పెట్టి అధిక మొత్తంలో రుణాలు పొందుతున్నారు. యజమానులు తెలుసుకొనేంత వరకు ఏళ్ల తరబడి ఆ పత్రాలు అడ్డుపెట్టుకుని అనేక సార్లు రుణాలు తీసుకుంటున్నారు.

2.40 (లక్షల ఎకరాలు)	ఉమ్మడి జిల్లాలో ఆక్వా విస్తీర్ణం
50,000	మొత్తం ఆక్వా రైతులు
రూ.550 కోట్లు	ఏడాదికి బ్యాంకుల ద్వారా ఇచ్చే రుణాలు
29	గత అయిదేళ్లలో నకిలీ పత్రాలతో రుణాలు పొందినట్లు పోలీసులు గుర్తించిన ఘటనలు

అధికారులతో కుమ్మక్కై

బ్యాంకు రుణం కోసం దరఖాస్తు చేసినప్పుడు అధికారులు వారి పత్రాలు సవ్యంగా ఉన్నాయా, నిజమైనవా కావా అని చూడాలి. క్షేత్రస్థాయిలో పరిస్థితులపై ఆ శాఖ అధికారులు వెళ్లి పరిశీలించాలి. సదరు వ్యక్తికి యజమాని భూమి కౌలుకు ఇచ్చారా, ఎంత విస్తీర్ణం ఇచ్చారు.. కౌలు మొత్తం ఎంత ఇలా ప్రతి అంశాన్ని నిర్ధారించుకున్న తర్వాతే ఆమోదం తెలపాలి. కానీ చాలా మంది బ్యాంకు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది రుణ దరఖాస్తుదారులతో కుమ్మక్కై ఏమీ పట్టించుకోకుండానే రుణాలిచ్చేస్తున్నారు. ప్రతిఫలంగా భారీగా ముడుపులు తీసుకుంటున్నారు. నరసాపురం, భీమవరం, కాళ్ల, ఉండి, కైకలూరు, గణపవరం, నిడమర్రు, ఆకివీడు, ఏలూరు తదితర ప్రాంతాల్లోని ఈ వ్యవహారాలు చాప కింద నీరులా జరిగిపోతున్నాయి. ఉన్నతాధికారులు సైతం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈ అంశమై ఎల్‌డీఎం నీలాంద్రిని వివరణ కోరగా పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వార్షిక రుణ ప్రణాళిక రూ.18,256 కోట్లు

- వ్యవసాయ రంగాభివృద్ధికి తోడ్పాటు అందించాలి
- మంత్రి పార్థసారథి



మాట్లాడుతున్న పార్థసారథి, చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్యే

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో వ్యవసాయరంగం అభివృద్ధికి బ్యాంకర్లు తోడ్పాటు అందించాలని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కౌలు రైతులు, చిరు వ్యాపారులకు అవసరమైన మేర రుణాలు అందించాలని సూచించారు. టిడ్కో ఇళ్ల నిర్మాణాలు ఇంకా పూర్తి కానందున లబ్ధిదారులకు తాకీదులు ఇవ్వడం సరికాదని, వారిపై ఒత్తిడి తేవద్దన్నారు. టిడ్కో రుణాలు చెల్లించలేదనే కారణంతో ఇతర రుణాల మంజూరులో లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేయవద్దని కోరారు. ఎఫ్‌పీవోలు, జేఎల్‌జీ, ఆర్ఎంజీలను ప్రోత్సహించి రుణాలు అందించాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు, వరదల నేపథ్యంలో పంటలకు అవసరమైన సస్యరక్షణ, ఎరువుల కొనుగోలుకు రైతులకు రుణం అవసరం అవుతుందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో బ్యాంకర్లు రుణాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఉన్నత విద్యకు మంజూరు చేసే రుణాల విషయంలో బ్యాంకర్లు సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. అనంతరం 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.18,256 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక విడుదల చేశారు. ఇందులో వ్యవసాయానికి రూ.12,632 కోట్లు, స్వల్పకాలిక వ్యవసాయ రుణాలకు రూ.7,943 కోట్లు, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రూ.2,452 కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ.695 కోట్లు కేటాయించారు. సమావేశంలో ఆర్‌బీఐ ఎల్‌డీవో పూర్ణిమ, లీడ్ బ్యాంకు రీజనల్ హెడ్ ఎన్.శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా తదితర అధికారులు పాల్గొన్నారు.

అనంతరం మంత్రి పార్థసారధి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కౌలు రైతులకు పంట రుణాల మంజూరుకు సంబంధించి రాబోయే రబీ నుంచి ప్రత్యేక విధానం అమలు చేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీలో భూయజమాని అంగీకారం ఉండాలని పెట్టిన నిబంధనతో కౌలు రైతులకు రుణాలు అందించడంలో బ్యాంకర్లు సాంకేతిక సమస్యలను ఎదుర్కొన్నారని తెలిపారు.

పసిడి ధరలు పైపైకి



నరసాపురం: బంగారు దుకాణంలో కొనుగోలు దారులు

నరసాపురం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం బంగారంపై దిగుమతి సుంకం, జీఎస్టీ తగ్గించినా మార్కెట్లో మాత్రం రోజు రోజుకూ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొనడంతో బంగారం ధరలపై ప్రభావం చూపుతోంది. బ్యాంకుల్లో డిపాజిట్లపై వడ్డీ రేట్లు కూడా తగ్గించడంతో మదుపుదారులు బంగారు, వెండి కొనుగోలుకు ఆసక్తి చూపుతుండటం కూడా ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు.



బంగారం 24 క్యారెట్లు 100 గ్రాముల ధర రూ. లక్షల్లో		కిలో వెండి ధర రూ.ల్లో
గతేడాది సెప్టెంబర్	: 6.60	88,000
వారం కిందట	: 7.28	90,800
ప్రస్తుతం	: 7.62	93,500

తగ్గిన కొనుగోళ్లు.. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నరసాపురం బులియన్ మార్కెట్టు అత్యంత కీలకం. భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, ఏలూరు తదితర ప్రాంతాల్లో సుమారు 800లకు పైబడి బంగారు ఆభరణాల విక్రయ దుకాణాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో కార్పొరేట్ సంస్థలకు చెందిన దుకాణా(షోరూము)ల్లో నెలకు సుమారు రూ.30 కోట్లు, రిటైల్ దుకాణాల్లో రూ.50కోట్లు పైబడి క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. నరసాపురంలో 78 బంగారు ఆభరణాల దుకాణాలు ఉన్నాయి. వాటిల్లో సాధారణంగా నెలకు రూ.15 కోట్ల వరకు క్రయ, విక్రయాలు జరుగుతాయని వ్యాపారులు చెబుతున్నారు. ధరల పెరుగుదల ప్రభావంతో ప్రజలు వెండి, బంగారు ఆభరణాలు కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. 'ప్రస్తుతం బంగారం ధరలు విపరీతంగా పెరుగుతుండటంతో అమ్మకాలు ఆశాజనకంగా లేవు. భవిష్యత్తుపై అంచనాలతో వ్యాపారాలు కొనసాగిస్తున్నాం' అని నరసాపురం బులియన్ వర్తక సంఘం అధ్యక్షులు వినోద్‌కుమార్‌జైన్ చెప్పారు.

ఆర్డీవోలకు స్థానచలనం

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఆర్డీవోలను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు ఆర్డీవోగా నరసాపురం ఆర్డీవో ఎం.అచ్యుత అంబరీశ్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఖాజావలికి తదుపరి పోస్టింగులు ఇచ్చే వరకు ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని సూచించారు. నూజివీడు ఆర్డీవోగా ఎం.వాణి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న భవానీ శంకరి తాడేపల్లిగూడెం ఆర్డీవోగా బదిలీ అయ్యారు.

కళలకు పుట్టినిల్లు హేలాపురి



గురు గీతా రాజ్ కర్కేరాను సన్మానిస్తున్న జస్టిస్ శేషసాయి, బుద్ధప్రసాద్, ఎమ్మెల్యే చంటి, వైఎంహెచ్ఏ, కేవీఎస్ ట్రస్టు సభ్యులు తదితరులు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: హేలాపురి కళలకు పుట్టినిల్లని.. దేశ, విదేశాల్లో కూచిపూడి, భరత నాట్య ప్రదర్శనలతో ప్రపంచ ప్రఖ్యాతి పొందిందని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి అన్నారు. వైఎంహెచ్ఏ హాలులో గురువారం రాత్రి హిందూ యువజన సంఘం, కేవీఎస్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో కె.వి. సత్యనారాయణ ప్రతిభ పురస్కార ప్రదానోత్సవం వైభవంగా జరిగింది. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జస్టిస్ శేషసాయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాట్య కళారత్న, కళా ఆచార్య శిరోమణి గురు గీతా రాజ్ కర్కేరా(యు.ఎస్.ఎ.)కు కేవీఎస్ పురస్కారాన్ని అతిథులు అందజేసి ఘనంగా సత్కరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన తొమ్మిది మంది నృత్య గురువుల సమక్షంలో వంద మందికి పైగా శిష్యులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కేవీసత్యనారాయణను వైఎంహెచ్ఏ ట్రస్టు సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి చంటి, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, పద్మశ్రీ దండమూడి సుమతీ, వైఎంహెచ్ఏ యాజమాన్య కమిటీ ప్రధాన కార్యదర్శి, కేవీఎస్ ట్రస్టు వ్యవస్థాపకుడు కె.వి.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కె.కె. గుప్తా, ముద్దు కృష్ణ, గౌరవ అధ్యక్షుడు వేణుగోపాల్ లునాని తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మంచి రోజులు!

- మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం
- ఉమ్మడి జిల్లాకు రూ.1.90 కోట్లు మంజూరు



భోజనం చేస్తున్న చిన్నారులు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏలూరు గ్రామీణ మండలంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనమున్నా మౌలిక సదుపాయాలు లేవు. అత్యవసర పరిస్థితుల్లో కాలకృత్యాలు తీర్చుకునేందుకు మరుగుదొడ్లు లేవు. చిన్నారులకు సురక్షిత తాగునీరు అందించే సౌకర్యం లేదు.

గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు, లబ్ధిదారులు అసౌకర్యాల నడుమ బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. ఉమ్మడి జిల్లాలోని చాలా కేంద్రాల్లో ఇలాంటి పరిస్థితులే ఉన్నా అయిదేళ్లలో సౌకర్యాలు కల్పించాలన్న విషయాన్ని ఆ ప్రభుత్వం విస్మరించింది. ఇప్పుడు పరిస్థితులు మారాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు మంచిరోజులు రానున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టింది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 19 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 4,450 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. వీటిలో సొంత భవనాలుండి కనీస వసతులు అవసరమైనచోట కల్పించనున్నారు. మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పనకు సంబంధించిన పనుల నిర్వహణ బాధ్యతను జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగానికి అప్పగించారు. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.36 వేలు, తాగునీటి కల్పనకు ఒక్కో ఆర్వో ప్లాంటుకు రూ.17 వేల చొప్పున ఖర్చు చేయనున్నారు.

701 కేంద్రాల్లో.. ఉమ్మడి జిల్లాలో సదుపాయాలు కల్పించాల్సిన కేంద్రాలు ఎన్ని ఉన్నాయో గుర్తించారు. ఆ మేరకు 701 కేంద్రాల్లో 377 మరుగుదొడ్లు, 324 తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రూ.1.90 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. కొన్ని మండలాల్లో ఎక్కువ పనులు మంజూరు చేశారు. వాటితో పాటు మిగిలిన కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన పనుల పర్యవేక్షణ బాధ్యతను ఆర్‌డబ్ల్యూఎస్‌కు అప్పగించారు. వీలైనంత వేగంగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు జిల్లా అధికారులు పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నారు.

త్వరలోనే ప్రారంభిస్తాం.. పక్కా భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చే దిశగా చర్యలు తీసుకుంటున్నాం' అని ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ఐసీడీఎస్ పీడీలు కేపీవీఎల్ పద్మావతి, బి.సుజాతరాణి తెలిపారు.

జిల్లా	మరుగుదొడ్ల నిర్మాణ పనులు	నిధులు (రూ.లక్షల్లో)	తాగునీటి సౌకర్యం	నిధులు (రూ.లక్షల్లో)
ఏలూరు	227	81.72	186	31.62
పశ్చిమ	150	54.0	138	23.46

స్వచ్ఛతాహీ సేవలో భాగస్వాములు కండి



ఆర్టీసీ బస్టాండు ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న పద్మశ్రీ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: సమాజంలోని ప్రతి ఒక్కరూ స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ పిలుపునిచ్చారు. గురువారం ఆమె స్థానిక ఆర్టీసీ కొత్త బస్టాండు ఆవరణలో మొక్క నాటి నీరు పోశారు. రహదారులను శుభ్రం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడారు. డీఆర్వో పుష్పమణి మాట్లాడుతూ ఈ నెల 17న ప్రారంభమైన స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలు అక్టోబరు 2తో ముగుస్తాయన్నారు. జడ్పీ సీఈవో సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు ద్వితీయ స్థానం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో జిల్లాకు ద్వితీయ స్థానం లభించిందని డీపీవో శ్రీనివాస విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజలను చైతన్యపరచడం, పారిశుద్ధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఈ ఘనత లభించిందని వివరించారు.

సగటు వర్షపాతం 2.3 మి.మీ.

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో బుధవారం ఉదయం 8.30 నుంచి గురువారం ఉదయం 8.30 గంటల మధ్య 2.3 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైందని ఇన్‌ఛార్జి సీపీవో బి.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. మండలాల వారీగా.. కలిదిండి 15.4, ముదినేపల్లి 11.6, మండవల్లి 9.6, దెందులూరు 3.8, ఉంగుటూరు 3.8, నిడమర్రు 2.8, కైకలూరు 2.4, ఆగిరిపల్లి 2.2, ద్వారకాతిరుమల 2.0, కుక్కునూరు 2.0 మి.మీ. చొప్పున వర్షం కురిసిందన్నారు.

దారులు దయనీయం..!


ఈసురోమంటున్న సంక్షేమం

ఇప్పుడే వస్తానని అనంతలోకాలకు..!

8లో

పాపికొండల మణిహారం.. అలరించే తీరం

నేడు పర్యాటక దినోత్సవం



ఉమ్మడి జిల్లాలో ఇలా


- 3.5 లక్షలు: ఏటా వచ్చే పర్యాటకులు
- రూ. 3 కోట్లు: వార్షిక ఆదాయం
- 2 వేలు: పర్యాటకంగా ఉపాధి పొందుతున్నవారు

ఉమ్మడి జిల్లాలో పర్యాటక ప్రాంతాలు

పాపికొండలు, పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమ ఎత్తిపోతల, ద్వారకాతిరుమల ఆలయం, ఎర్రకాలువ జలాశయం, గుంటుపల్లి గుహలు జీలకర్రగూడెం, గుబ్బల మంగమ్మగుడి, పారిజాతగిరి, కొల్లేరు సరస్సు, పేరుపాలెం బీచ్, పెదమల్లం రిసార్ట్స్, యలమంచిలిలంక, చించినాడ, నరసాపురం గోదావరి తీర ప్రాంతాలు.

పాలకొల్లు, పోలవరం, కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే

ఉమ్మడి పశ్చిమలో ప్రకృతి రమణీయత ఎంత చూసినా తనివి తీరదు. పేరుపాలెం దగ్గర 9 కి.మీ. మేర విస్తరించి ఉన్న సాగర తీరం జిల్లాకు ఒక వరమే. 60 కి.మీ. మేర వ్యాపించి ఉన్న గోదావరి అందమే వేరు. ఇంతటి ప్రత్యేకత ఉన్న జిల్లాలో కూటమి ప్రభుత్వం వచ్చాక పర్యాటక బాటలు పరచుకుంటున్నాయి.







ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో 1.01 లక్షల ఎకరాల్లో విస్తరించిన పాపికొండల అభయారణ్యంలో వన్యప్రాణుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో వాటి సంరక్షణతో పాటు పాపికొండల సందర్శనకు వచ్చే పర్యాటకుల కారణంగా ఎటువంటి అవాంతరం తలెత్తకుండా పోలవరంలో వన్య ప్రాణి విభాగం సబ్ డీఎఫ్‌వో కార్యాలయం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. . వన్య ప్రాణుల సంరక్షణతో పాటు పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు అటవీశాఖ తరపున పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు పోలవరం ఇన్‌ఛార్జి అటవీశాఖాధికారి ఎం.దావీద్‌రాజు తెలిపారు.

రానున్నదంతా సీజనే.. వచ్చే నవంబరులో కార్తిక మాసం నుంచి డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి వరకు ఉమ్మడి జిల్లాలో పర్యాటకశాఖ అతిథి గృహాలు ముందస్తు బుకింగ్‌లతో కిక్కిరిసిపోతాయి. ఏటా పోటెత్తుతున్న పర్యాటకులకు గోదావరి, పేరుపాలెం తీరంలో విశ్రాంత గృహాలు సరిపోవడం లేదు. దీనిపై జిల్లా పర్యాటకశాఖాధికారి ప్రభాకర్‌ను సంప్రదించగా పర్యాటక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం జిల్లాల వారీగా కసరత్తు చేస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాలోని గోదావరి తీర ప్రాంతాల్లో బోటింగ్ పాయింట్లు పెట్టేందుకు ప్రతిపాదనలు చేశామని చెప్పారు.

- ఆచంట మండలం పెదమల్లంలో 2019కు ముందు పర్యాటక అతిథి గృహాలు నిర్మించారు. వీటికి అయిదేళ్ల వైకాపా పాలనలో కనీసం రహదారి నిర్మించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉపాధి నిధులు రూ.2 కోట్లతో రహదారి నిర్మించడానికి ప్రతిపాదనలు చేసింది. జిల్లాలో పేరుపాలెం బీచ్‌కు ఏటా ఒక్క కార్తికమాసంలోనే 2 లక్షల మంది పర్యాటకులు వస్తుంటారు. పర్యాటకంగా ఇప్పటికే కొన్ని వసతులున్నా సరిపోని నేపథ్యంలో ఆశాఖ కొత్త ప్రతిపాదనలు చేసింది. సముద్రానికి చేరువలో వంద ఎకరాలు సేకరించడానికి ప్రస్తుతం భూములు గుర్తిస్తున్నారు. ఆయా భూములను లీజుకు తీసుకుని వాటిలో జలక్రీడలు అభివృద్ధి చేయాలనేది ప్రణాళిక.



ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి


మంత్రి పార్థసారథికి సమస్యలు వివరిస్తున్న పొరుగు సేవల ఉద్యోగులు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఉద్యోగ భద్రత కల్పించాలని గృహ నిర్మాణ సంస్థలోని పొరుగు సేవల సిబ్బంది గురువారం మంత్రి పార్థసారథికి ఏలూరులో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి తాము పొరుగు సేవల విధానంలో పని చేస్తున్నామని, తమకు ఉద్యోగ భద్రత లేదన్నారు. తమతోపాటు ఉద్యోగాలు పొందిన డీఆర్‌డీఏ, డ్వామా, ఎన్‌టర్‌ప్రైజెస్ ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేస్తున్నారని, తమకు కూడా సీనియార్టీ ప్రకారం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాకాంక్షలు నెరవేరుస్తున్నాం: మంత్రి

పాలకొల్లు, న్యూస్‌టుడే: పేద, మధ్య తరగతి ప్రజల ఆకాంక్షలను దశలవారీగా నెరవేరుస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. యలమంచిలి మండలం కొంతేరులో గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' సభ నిర్వహించారు. మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ... రాష్ట్రాన్ని ఎలాగైనా చిక్కుల్లో పడేయాలన్న దురాలోచనతో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని మండిపడ్డారు. విజయవాడను వరదలు చుట్టుముట్టి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, ప్రకాశం బ్యారేజీని ధ్వంసం చేసేందుకు వైకాపా కుట్ర చేసిందని దుయ్యబట్టారు. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న ఎన్డీయే ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

ఇసుక నిల్వ కేంద్రాల్లో అదనపు సిబ్బంది

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి ఇసుక కమిటీ చైర్‌పర్సన్ కె.వెట్రిసెల్వి ఆదేశాల మేరకు ఇసుక నిల్వ కేంద్రాల్లో అదనపు సిబ్బందిని నియమించినట్లు జేసీ ధాత్రిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుకను ఆన్‌లైన్లో బుక్ చేసుకున్న వారికి ఎలాంటి ఇబ్బందులులేకుండా చర్యలు చేపట్టామన్నారు. రాత్రివేళల్లోనూ ఇసుక నిల్వ కేంద్రాలు పనిచేసేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

గొప్ప రాజకీయ నాయకుడు సీతారాం


ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చంటి తదితరులు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: సీతారాం ఏచూరి గొప్ప రాజకీయ నాయకుడని ఎమ్మెల్యే బడేటి చంటి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం అన్నారు. సీపీఎం సీనియర్ నేత ఏచూరి సంస్మరణ సభను పార్టీ జిల్లా కార్యదర్శి రవి అధ్యక్షతన ఆర్‌ఆర్ పేటలోని శ్రీ కోటీశ్వర్ల కల్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. ముందుగా నాయకులు ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా హాజరైన చంటి, మంతెన సీతారాంలు మాట్లాడుతూ ఏచూరి మరణం తీరని లోటని, పేదల కష్టాలు తెలిసిన నాయకుడని కొనియాడారు. ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య, న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకుడు నాగరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు తదితరులు మాట్లాడారు. పలువురు నాయకులు హాజరయ్యారు.

సాఫ్ట్ టెన్నిస్, హ్యాండ్ బాల్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

వీరవాసరం, న్యూస్‌టుడే: పాఠశాల విద్యా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగాల బాలబాలికల సాఫ్ట్ టెన్నిస్, హ్యాండ్ బాల్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 28, 30వ తేదీల్లో నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యా సమాఖ్య జిల్లా కార్యదర్శి పీఎస్ఎన్ మల్లేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న సాఫ్ట్ టెన్నిస్ ఎంపిక పోటీలను గణపవరం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో, 30న హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలను ఏలూరు ఇండోర్ స్టేడియం గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ప్రవేశ పత్రంతో పాటు మధ్యాహ్నా భోజన పత్రాలను వెంట తీసుకురావాలన్నారు. వివరాలకు 63052 27671, 80741 53923 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

దారులు దయనీయం..!


కొణికిలో ఇలా..


కొణికి-కుదరవల్లి వంతెనపై శిథిలమైన నడకదారి

పెదపాడు మండలంలో రహదారులు, వంతెనలు దయనీయంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు గోతుల్లో రాళ్లు తేలాయి. వంతెనలు కుంగిపోయి నెర్రెలిచ్చాయి. వంతెనలపై నడకదారుల్లో సిమెంట్ పలకలు ఛిద్రమయ్యాయి. వీటిపై వెళ్లేందుకు వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. వైకాపా ఐదేళ్ల పాలనలో వీటికి మరమ్మతులు చేసిన దాఖలాలు లేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు పరిశీలించి రహదారులు, వంతెనలకు మరమ్మతులు చేపట్టాలని వారంతా కోరుతున్నారు. **- ఈనాడు, పెదపాడు**


వట్లూరు నుంచి పెదపాడు వెళ్లే మార్గంలో శిథిలమై నెర్రెలిచ్చిన వంతెన

మేము సైతం..!

● అభివృద్ధిలో ప్రజా భాగస్వామ్యం
● స్ఫూర్తినిస్తోన్న కైకలూరు నియోజకవర్గ వాసులు

కలిదిండి, కైకలూరు, న్యూస్‌టుడే

ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురు చూడట్లేదు. ప్రభుత్వమే దిగి రావాలి.. అధికారులే చేయాలని ఆశించట్లేదు. 'మేము సైతం..' అంటూ ప్రజలే స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. కష్టపడి సంపాదించిన దానిలో కొంత సమాజానికి ఖర్చు పెట్టాలని భావిస్తున్నారు. ఒకే మాటతో.. చేయి చేయి కలిపి గ్రామ అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు. సమస్యల పరిష్కారంలో చేదోడుగా నిలుస్తున్నారు. కైకలూరు నియోజకవర్గ ప్రజల స్ఫూర్తికి జిల్లా వ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

మూడు గ్రామాల ప్రజలు కలిసి..

కొల్లేరు లంక గ్రామాల ప్రజలు స్ఫూర్తిదాయకంగా నడుచుకుంటున్నారు. వరద సమయాల్లో గండ్లు పడి గ్రామాలు మునిగిపోతున్న సమయంలో స్వయంగా ఆ గండ్లు పూడ్చివేతకు ముందుకొస్తున్నారు. గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రోడ్లను బాగు చేసుకోవడానికి పూనుకున్నారు. సర్కారు కాలువ - పందిరిపల్లిగూడెం, పైడిచింతపాడు - గోకర్ణపురం రోడ్లకు తాత్కాలిక మరమ్మతుల నిమిత్తం పందిరిపల్లిగూడెం, శృంగవరప్పాడు, గుమ్మళ్లపాడు గ్రామాల ప్రజలు ఒక్కో కుటుంబం నుంచి రూ.300 చొప్పున రూ.24 లక్షల విరాళాలు సేకరించారు.





రైతుల పెద్ద మనసు

కలిదిండి మండలంలోని గుర్వాయిపాలెం - భాస్కరరావుపేట రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ఈ మార్గంలో ఆరు గ్రామాలున్నాయి. గుంతల్లో పడి వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ద్విచక్ర వాహన చోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల రైతులు స్వచ్ఛందంగా మరమ్మతులకు ముందుకొచ్చారు. రూ.10 లక్షల విరాళాలు వేసుకుని.. స్వయంగా దగ్గరుండి పెద్ద పెద్ద గుంతలు పూడ్పించారు.

కాలువల ప్రక్షాళనకు సన్నద్ధం

కొల్లేరుకు సముద్రానికి అనుసంధానంగా ఉన్న ఉప్పుటేరుతోపాటు నియోజకవర్గంలోని ప్రధాన కాలువల ప్రక్షాళనకు రైతులు ముందడుగు వేశారు. పూడిక తీత, కిక్కిస, గుర్రపు డెక్క తొలగింపు, గట్లు బలోపేతం చేయడానికి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ నేతృత్వంలో నిర్ణయించుకున్నారు. రూ.45 లక్షల వ్యయంతో రెండు పంట్లు సొంతంగా తయారు చేయించనున్నారు. ఆ తర్వాత నిర్వహణ ఖర్చులనూ భరించడానికి సిద్ధంగా ఉన్నారు. దీనిని నిమిత్తం ఎకరాకు రూ.200 నుంచి రూ.500 వరకు విరాళాలు ఇస్తామంటూ ప్రకటించారు.

విద్యార్థి ఆచూకీ కనుగొనండి: ఎంపీ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: మారేడుమిల్లి అటవీ ప్రాంతంలోని జల తరంగిణి వాగులో కొద్ది రోజుల కిందట కొట్టుకుపోయిన వైద్య విద్యార్థి ఆచూకీ కనుగొనాలని ఎంపీ మహేశ్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వాగులో కొట్టుకు పోయిన ముగ్గురు విద్యార్థుల్లో ఇద్దరి మృతదేహాలు లభించగా.. హరదీప్ ఆచూకీ ఇంతవరకూ కనుగొనలేకపోయారని అతని తల్లిదండ్రులు గురువారం ఎంపీ దృష్టికి తెచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ హరదీప్ ఆచూకీ కనుగొనేందుకు అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని ఎస్పీని కోరారు.

రంగంలోకి డాగ్‌స్క్వాడ్.. కొనసాగుతున్న గాలింపు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి జలపాతంలో గల్లంతైన వైద్య విద్యార్థి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. అయినా ఆచూకీ మాత్రం లభ్యం కాలేదు. గాలింపు చర్యలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, ఏఎస్పీ జగదీశ్ అడహళ్లి, జిల్లా అటవీశాఖ అధికారిణి బబిత గురువారం స్వయంగా పర్యవేక్షించారు. గత ఆదివారం ఏలూరులోని ఆశ్రం వైద్య కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు గల్లంతైన విషయం తెలిసిందే. వారిలో సీహెచ్ హరదీప్ (20) ఆచూకీ ఇప్పటికీ లభించని విషయం తెలిసిందే. అయిదు రోజులుగా పోలీసు, రెవెన్యూ, అటవీశాఖ బృందాలతోపాటు, కేంద్ర, రాష్ట్ర విపత్తుల బృందాలు (ఎన్డీఆర్ఎఫ్) నిర్విరామంగా గాలిస్తున్నాయి. ఇందుకోసం డ్రోన్లు కూడా వినియోగిస్తున్నారు. గురువారం నుంచి డాగ్ స్క్వాడ్‌లను రంగంలోకి దింపారు. ఎట్టి పరిస్థితుల్లో విద్యార్థి ఆచూకీ కనిపెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు. మన్యంలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో సదరు విద్యార్థి ప్రవాహంలో కొట్టుకుని పోయి, పాములేరు మీదుగా గోదావరిలోకి వెళ్లిపోయి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చిత్రలేఖన పోటీల విజేతలు వీరే


ప్రథమ స్థానం పొందిన చిత్రం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీ విజేతల వివరాలను ఆ సంస్థ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు ఒక ప్రకటనలో వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన విజేతలకు అక్టోబరు 1న భీమవరంలోని క్విట్ ఇండియా స్తూపం వద్ద, ఏలూరు జిల్లా విజేతలకు అక్టోబరు 2న పెదనిండ్రకొలను గాంధీ భవనంలో, తూర్పుగోదావరి జిల్లా విజేతలకు అదేరోజు మల్లవరంలోని గాంధీ ఆశ్రమంలో బహుమతులు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ ప్రశంస పత్రాలను పంపిస్తామని తెలియజేశారు.

సబ్ జూనియర్స్ విభాగంలో.. ప్రథమ: పి.మోక్షిత- దర్భగూడెం, ద్వితీయ: సాయి స్వాగత్- నందమూరుగరువు, తృతీయ: కె.గంగ హోమిని- దండగర్ర.

జూనియర్స్ విభాగంలో.. ప్రథమ: సీహెచ్ భావిశ్- వేలివెన్ను, ద్వితీయ: టి.భార్గవ్- ఏలూరు, తృతీయ: గాయత్రి- శనివారపుపేట.

సీనియర్స్ విభాగంలో.. ప్రథమ: టెఫిని- భీమవరం, ద్వితీయ- ఎ.శ్రీవర్షిణి- మేడపాడు, తృతీయ- ఎస్.ప్రజ్ఞ తపస్వి- నిడదవోలు.

కళాశాలల స్థాయిలో. ప్రథమ: శ్యామలగౌరి- భీమవరం, ద్వితీయ: నిహారిక- ఏలూరు, తృతీయ: కె.హర్ష- బుట్టాయగూడెం.

నేడు రాష్ట్ర స్థాయి రైతు సదస్సు


మాట్లాడుతున్న నాయకులు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీకృష్ణ యాదవ కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి రైతు సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక యూటీఎఫ్ భవనంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రైతులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సదస్సు అనంతరం మూడు రోజుల పాటు జరిగే కార్యకర్తల శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయి రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకుడు గుత్తికొండ వెంకటకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

చూర పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: కొయ్యలగూడెం వేలం కేంద్రంలో చూర పొగాకు కొనుగోళ్లు గురువారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు కేజీ రూ.245 అత్యధిక ధర లభించింది. త్వరలోనే కొనుగోళ్లు పూర్తి చేస్తామని వేలం నిర్వహణాధికారిణి గ్రేస్ మార్గరేట్ తెలిపారు.

ఇంజినీరింగ్ సహాయకుడి సస్పెన్షన్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: నరసాపురం మండలం దర్బరేవు ఇంజినీరింగ్ సహాయకుడు కొల్లాటి లీలాకృష్ణను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ నాగరాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఇళ్లకు చెల్లింపులు జరిగాయని ఆ గ్రామస్థుల నుంచి ఫిర్యాదు వచ్చినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. విచారణలో ఆరోపణలు వాస్తవమని నివేదిక అందడంతో ఆ మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

18 గ్రాముల బంగారు నక్లెస్ చోరీ

పెనుగొండ, న్యూస్‌టుడే: వెంకట్రామపురం శివారు మల్లప్పదిబ్బలో నివాసముంటున్న కూచిపూడి దుర్గ ఇంట్లో సుమారు 18 గ్రాముల బంగారు నక్లెస్ చోరీకి గురైందని ఎస్సై కొప్పిశెట్టి గంగాధర్ తెలిపారు. బాధిత మహిళ ఇంటి వద్దే కిరాణా దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తోంది. ఈమె కుమార్తెతో కలిసి గురువారం ఓ వేడుకకు వెళ్లారు. తిరిగి ఇంటికొచ్చి చూడగా- బీరువాలో నక్లెస్ కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఈసురోమంటున్న సంక్షేమం

అద్దె భవనాలు... అరకొర సౌకర్యాలతో వెతలు

ఈనాడు డిజిటల్, భీమవరం, తాడేపల్లిగూడెం అర్బన్, వీరవాసరం, తణుకు గ్రామీణం:

పేద, మధ్య తరగతి విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు ఏర్పాటుచేసిన వసతి గృహాలు సమస్యలకు నిలయంగా మారుతున్నాయి. అరకొర వసతుల నడుమ కొనసాగుతున్నాయి. పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, మెనూ ప్రకారం భోజనం లేదని, కాస్మొటిక్ ఛార్జీలు విడుదల కాలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశ్చిమగోదావరి జిల్లాలోని బీసీ వసతిగృహాలు **29** | విద్యార్థులు **1,910**


యాగర్లపల్లి బాలికల వసతి గృహంలో రంగుమారిన మంచినీరు

తాడేపల్లిగూడెం, యాగర్లపల్లిలో బీసీ వసతిగృహ భవనాలు శిథిలమవడంతో గతేడాది గొల్లగూడెం కూడలిలోని ఓ ప్రైవేట్ భవనంలోకి తరలించారు. ఇక్కడ 52 మంది విద్యార్థులుండగా నాలుగే మరుగుదొడ్లు ఉన్నాయి. 15 మంది చాలీచాలని ఆరు గదుల్లో సర్దుకోవాల్సి వస్తోంది. మరుగుదొడ్లు, గదులను క్రమం తప్పకుండా శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని విద్యార్థులు వాపోతున్నారు.

వీరవాసరం బీసీ బాలుర పాఠశాల వసతి గృహంలో 45 మంది విద్యార్థులున్నారు. నాలుగు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. పడకలు (మంచాలు) లేక కిందే పడుకుంటున్నారు. మెనూ అమలు కాక, ఆహారంలో నాణ్యత లేకపోవడంతో విద్యార్థులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. ఇటీవలే కొంతమంది జ్వరం బారినపడ్డారు.



తణుకులో బీసీ బాలిక పాఠశాల, కళాశాల వసతి గృహాలు రెండూ ఒకేచోట నిర్వహిస్తున్నారు. 70 మంది విద్యార్థులున్నారు. పైకప్పు పెచ్చులూడటంతో వర్షపు నీరు కారుతోంది. గోడలు చెమ్మగిల్లి చలికి వణికిపోతున్నారు. వంట గదిలో పందికొక్కులు నెలను తవ్వేస్తుండటంతో పరిసరాలు అధ్వానంగా మారాయి.


తణుకు బీసీ బాలికల వసతిగృహంలో పైకప్పు పెచ్చులూడి చెమ్మగిల్లుతున్న గోడలు

నాణ్యత లేని ఆహారం

★ విద్యార్థుల్లో పౌష్టికాహారం లోపాన్ని అధిగమించడానికి రూపొందించిన ప్రత్యేక మెనూ అమలు చేయడం లేదు. గతంలో భీమవరంలోని బీసీ బాలుర కళాశాల వసతి గృహానికి చెందిన 11 మంది విద్యార్థులు గతంలో అస్వస్థతకు గురయ్యారు.

★ తాడేపల్లిగూడెంలోని గతనెలలో ఓ వసతిగృహ విద్యార్థిని పౌష్టికాహార లోపంతో అస్వస్థతకు గురైంది. ఇలాంటి పరిస్థితులు జిల్లాలో ఎక్కడోక చోట జరుగుతూనే ఉన్నాయి. వసతిగృహంలో ఉంటున్న ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రూ.1600 చెల్లిస్తుండగా, ఇది సరిపోవడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు.

★ భీమవరంలోని బీసీ బాలురు, బాలికల కళాశాల వసతిగృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీరవాసరంలో సొంత భవన నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినా స్థలం లేక అద్దె భవనాల్లో కొనసాగుతోంది.

★ పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 29 బీసీ వసతి గృహాలున్నాయి. ఇక్కడ 1910 మంది విద్యార్థులుండగా, కాస్మొటిక్, డైట్ ఛార్జీలు సుమారు రూ.87 లక్షల వరకు పెండింగ్ ఉన్నాయి.

చెరువులో పడి యువకుడి మృతి

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చెరువులో పడి యువకుడు మృతిచెందిన ఘటన చింతలపూడి మండలం రేచర్లలో చోటుచేసుకుంది. ఎస్సై కుటుంబరావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఏలూరు నాగరాజు(26) తాపీ పనులు చేసుకుంటూ తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం పనికి వెళ్లి తిరిగి ఇంటికొచ్చాక సమీపంలోని చెరువు వద్దకు వెళ్లాడు. అనంతరం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా.. ఆచూకీ తెలియలేదు. గురువారం ఉదయం పశువుల కాపరులు చెరువులో మృతదేహాన్ని గుర్తించి గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. శవాన్ని వెలికితీసి చూడగా నాగరాజుగా గుర్తించారు. దీనిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

విద్యార్థిని అదృశ్యం

కాలువలో దూకినట్లు అనుమానం


బాలిక ఆచూకీ కోసం గ్రామస్థుల నిరీక్షణ

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే : తొమ్మిదో తరగతి విద్యార్థిని అదృశ్యమైన ఘటన తణుకు మండలం కోనాల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కోనాల గ్రామానికి చెందిన విద్యార్థిని ముద్దాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. గురువారం బ్యాగు తరగతి గదిలో ఉంచి బయటకు వెళ్లిపోయింది. అనుమానం వచ్చిన ఉపాధ్యాయులు విద్యార్థిని కోసం గాలించారు. ముద్దాపురం నుంచి దువ్వ వెళ్లే రహదారిలో మూలలంక వయ్యేరు వంతెన వద్ద ఆమె చెప్పులు ఉండటంతో కాలువలో దూకినట్లు అనుమానిస్తున్నారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని కాలువలో గాలింపు చేపట్టారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామీణ ఎస్సై జీఎస్‌వి మూర్తి అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాపు చేస్తున్నారు.

★ విద్యార్థినిని ప్రధానోపాధ్యాయుడు మందలించడం వల్లే మనస్తాపం చెంది కాలువలో దూకి ఉంటుందని ఆమె తల్లిదండ్రులు ఆరోపించారు.

ఇప్పుడే వస్తానని అనంతలోకాలకు..!

● నిండు ప్రాణాన్ని హరించిన నిద్ర మత్తు ● తాడేపల్లిగూడెంలో కారు బీభత్సం ● ఒకరు మృతి.. ఇద్దరికి గాయాలు


దుర్గారావు (పాత చిత్రం)


ప్రమాదానికి కారణమైన కారు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఇప్పుడే వస్తానని బయటకు వెళ్లిన ఇంటి పెద్ద దిక్కు కారు ప్రమాదంలో విగత జీవిగా మారారు. తాడేపల్లిగూడెం పట్టణంలో కారు బుధవారం అర్ధరాత్రి బీభత్సం సృష్టించింది. రోడ్డుపై నడుస్తున్న ముగ్గురిని ఢీ కొట్టడంతో ఒకరు మృతిచెందగా.. .ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. నిడమర్రు మండలం బువ్వనపల్లికి చెందిన వినయ్ బాబు కారు డ్రైవర్‌గా పని చేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని బుధవారం రాత్రి కారులో రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో దించి ఇంటికి తిరుగుపయణమయ్యారు. రెండో పట్టణానికి చెందిన కరణం దుర్గారావు (30), యడ్ల నాగేశ్వరరావు, మజ్జి దుర్గాప్రసాద్ పోలీస్ ఐలాండ్ నుంచి రేలంగి చిత్రమందిరం వైపు నడుచుకుంటూ వెళ్తున్నారు. నిద్రమత్తులో కారు నడుపుతున్న వినయ్‌బాబు వీరిని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో దుర్గారావు అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వారిని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. వీరిలో యడ్ల నాగేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉండటంతో రాజమండ్రిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంబం

మృతుడు దుర్గారావు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈయనకు భార్య ఇద్దరు మగ సంతానం ఉన్నారు. ఇప్పుడే వస్తానని ఇంటి నుంచి బయటకొచ్చిన దుర్గారావు కారు ప్రమాదంలో తిరిగిరాని లోకానికి వెళ్లడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరైంది. ఇంటి పెద్దను కోల్పోవడంతో ఇద్దరు చిన్నారులు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

ఆర్థిక సంక్షోభంలోనూ హామీల అమలు


మాట్లాడుతున్న చింతమనేని ప్రభాకర్

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం మొండూరులో గురువారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేసి ప్రజల విశ్వసనీయతను చూరగొందన్నారు. తెదేపా పెదవేగి మండల అధ్యక్షుడు సుధా, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల నిర్మూలన ఆవశ్యకతపై ప్రదర్శన


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

భీమడోలు, న్యూస్‌టుడే: ప్రాణాంతక వ్యాధులను వ్యాప్తి చేస్తున్న దోమల నిర్మూలన కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని జిల్లా మలేరియా అధికారి ప్రసాద్ అన్నారు. గుండుగొలను పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆగడాలలంకలో దోమల నిర్మూలన ఆవశ్యకతపై ప్రజలను చైతన్యపరుస్తూ ప్రదర్శన, అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. పారిశుద్ధ్య పనులు పరిశీలించి, దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. సహాయ మలేరియా అధికారి గోవిందరావు, హెల్త్ సూపర్‌వైజర్ రామకృష్ణ, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దత్తనాథ క్షేత్రంలో మహా పూర్ణాహుతి



ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: దొండపాడు శ్రీ నం దత్తనాథ క్షేత్రంలో అయిదు రోజుల పాటు నిర్వహించిన దత్త మూల మంత్ర హోమం గురువారం ముగిసింది. చివరి రోజు వేద పండితుల మంత్రాల నడుమ మహాపూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దత్తాత్రేయస్వామిని దర్శించుకున్నారు.

హుండీ ఆదాయం రూ.88,273.. ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సత్రంపాడులోని లక్ష్మీగణపతి ఆలయంలో హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 21 రోజులకు రూ.88,273 ఆదాయం వచ్చినట్లు ఈవో చిననాగేశ్వరరావు తెలిపారు. వీటితో పాటు 21 అమెరికన్ డాలర్లు వచ్చాయని వివరించారు. హుండీ లెక్కింపును దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షించారు. భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

కోఆప్షన్ సభ్యులుగా తెదేపా వర్గీయులు!

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: నగర పాలక సంస్థలో ఖాళీ అయిన మూడు కోఆప్షన్ సభ్యత్వాలకు రెండు రోజుల కిందట తెదేపా నాయకులైన చోడే వెంకటరత్నం, కొల్లేపల్లి రాజు, జాలా సుమతి నామినేషన్లు వేశారు. గురువారం నామినేషన్ల దాఖలు గడువు పూర్తయ్యింది. ఆయా సభ్యత్వాలకు వైకాపాకు చెందిన వారెవరూ నామినేషన్లు వేయకపోవడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

వరద బాధితులకు చేయూత

ఉంగుటూరు, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు బాసటగా నిలిచేందుకు దాతలు ముందుకొచ్చారు. నిడమర్రు మండలం దేవరగోపవరానికి చెందిన కొమ్మన లక్ష్మణరావు, ఇండిగిమిల్లి పెదకాపు, అడబాల వెంకన్నబాబు, కమ్మిల శివ నాగాంజనేయులు రూ.5 వేల చొప్పున రూ.20 వేలు, తోకలపల్లికి చెందిన జల్లూరి నరసింహారావు, చంద్రశేఖర్ చెరో రూ.5 వేలు, గణపవరం మండలం మొయ్యేరు సొసైటీ మాజీ అధ్యక్షుడు గంటా రామకృష్ణ రూ.5 వేలు, సొసైటీ సిబ్బంది రూ.5 వేలు, నారాయణపురంలోని నటరాజ్ ఐస్ పరిశ్రమ తరఫున రూ.5 వేలను సీఎం సహాయ నిధికి విరాళంగా ఇచ్చారు.

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం తహసీల్దారు నాగరాజు ఆధ్వర్యంలో తోకలపల్లికి చెందిన రైతు ముదునూరి సూర్యనారాయణ రూ.50 వేలు, నిడమర్రు మండల రైతులు రూ.లక్ష.. మొత్తాన్ని రూ.1,50,000 సీఎం సహాయనిధికి అందజేశారు. చెక్కు, డీడీల రూపంలో నిడమర్రు మండల పరిషత్తు కార్యాలయంలో ఎమ్మెల్యే ధర్మరాజుకు గురువారం అందజేశారు.

ఐలమ్మకు నివాళులు.. గొల్లగూడెం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: భూమి, భుక్తి, పేదల విముక్తి కోసం ఐలమ్మ పోరాడిన తీరును స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని మండలంలోని గొల్లగూడెంలో రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆమె విగ్రహానికి ఎమ్మెల్యే ధర్మరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచి కరపా వెంకట శ్రీనివాస్, అఖిల భారత దోభీ మహాసంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జొన్నాడ శ్రీనివాస్, రజక సంఘం మండల అధ్యక్షుడు పిప్పర ప్రసాద్, పల్లంట్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎప్పుడొస్తారో ఏమో!

★ వైద్యుడి కోసం దివ్యాంగుల ఎదురుచూపులు

★ దెందులూరు సదరం శిబిరం వద్ద ఇదీ పరిస్థితి

దెందులూరు, న్యూస్‌టుడే

దెందులూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలోని సదరం శిబిరానికి వచ్చే దివ్యాంగుల పరిస్థితి దయనీయంగా మారింది. నియోజకవర్గంలోని దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు వైద్యుని కోసం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆహార పానీయాలు లేకుండా పడిగాపులు కాస్తూ నిరీక్షించాల్సి వస్తోంది.

దెందులూరు సీహెచ్‌సీలో ప్రతి బుధవారం సదరం శిబిరం నిర్వహిస్తారు. తణుకు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వైద్యుడు ఇక్కడికొచ్చి దివ్యాంగులను పరీక్షిస్తుంటారు. శిబిరం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తారు. వైద్యుడు బుధవారం మధ్యాహ్నం ఒకటిన్నర గంటకు వచ్చారు. అప్పటివరకు వేచి ఉన్నవారు ఆహార పానీయాలు లేక నీరసించిపోయారు. ఎవరూ పట్టించుకునే వారే లేరని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వారంలో వైద్యుడు మధ్యాహ్నానికి ముందే వెళ్లిపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన కొంతమంది నిరాశగా వెనుదిరిగారు. వైద్యుడు సమయపాలన పాటించకపోవడంతో ఇబ్బందికరంగా ఉంటోందని, అందుబాటులోని వైద్యులను సదరం శిబిరానికి కేటాయించాలని దివ్యాంగులు కోరుతున్నారు.

ఈ విషయమై సీహెచ్‌సీ వైద్యాధికారి సుందరబాబు మాట్లాడుతూ తణుకు ఆసుపత్రి నుంచి వైద్యుడు ఇక్కడికి వస్తున్నారన్నారు. అక్కడి ఆసుపత్రిలో ఓపీ చూడాల్సి ఉన్నందున ఆలస్యం అవుతోందని.. అప్పటి వరకు ఉండాల్సిందేనన్నారు.

పెదవేగి మండలం పినకడిమి నుంచి మండలంలో నుంచి లేవలేని ఓ వృద్ధుడిని బంధువులు ఉదయమే శిబిరానికి తీసుకొచ్చారు. వైద్యుడు వచ్చేవరకు స్ట్రెచర్‌పై మూడు గంటలకు పైగా ఆరుబయటే ఉంచారు. ఇలా పలువురు దివ్యాంగులు వైద్యుని కోసం పడిగాపులు కాశారు.





ఏలూరు మండలం ప్రతికోళ్ల లంకకు చెందిన భలే రామారావు పక్షవాతంతో బాధ పడుతున్నారు. ఇతను నడవలేరు. బంధువులు గ్రామం నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరి దెందులూరు సీహెచ్‌సీ సదరం శిబిరానికి తీసుకొచ్చారు. వైద్యుడు వచ్చేవరకు ఇతను వీల్‌ఛైర్‌లో అలానే కూర్చొని ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు తూర్పువీధి: 80081 23847 | ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483 | ఉంగుటూరు: 79933 00492

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే

సమస్య: ఏలూరు బావిశెట్టివారిపేట శ్రీరామకాలనీ మొదటి రోడ్డులోని కాలువలో మురుగు పేరుకుపోయింది. దుర్వాసన, దోమల బెడదతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

- వి.సుధీర్‌బాబు, శ్రీరామకాలనీ

సమాధానం: సిబ్బందితో కాలువలో పూడిక తీయిస్తాం.

- సిద్దయ్య, నగర పాలక సహాయాధికారి

సమస్య: కొత్తూరు రాజీవ్ గృహకల్ప కాలనీలో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. రాత్రివేళ పాదచారులు, వాహన చోదకులు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు.

- డి.మణికంఠ, రాజీవ్ గృహకల్ప కాలనీ

సమాధానం: సిబ్బందితో వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం.

- కె.శేషగిరి, విద్యుత్తు ఏఈ

సమస్య: ఏలూరు వంగాయగూడెం నుంచి పెదపాడు వెళ్లే రోడ్డులో లక్ష్మమ్మ చెరువు కాలనీ రామాలయం మార్గంలోని మురుగు కాలువలో పూడిక తీయడం లేదు. వాడుక నీరు నిలిచి రాకపోకలకు స్థానికులు అవస్థలు పడుతున్నారు.

- ఆర్.నాయుడు, స్థానికుడు

సమాధానం: సిబ్బందితో కాలువలో పూడిక తీయిస్తాం.

- భానుప్రతాప్, నగర పాలక అధికారి

స్పందనకు వందనం

వెలుగొచ్చింది.. ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: వంగాయగూడెం సుబ్రహ్మణ్యం కాలనీ రోడ్డులో వీధి దీపాలను వెలిగించారు. ఈ సమస్యపై ఈ నెల 25న ప్రచురితమైన వార్తకు విద్యుత్తు ఏఈ కె.శేషగిరి స్పందించి సిబ్బందితో మరమ్మతులు చేయించి వెలిగేలా చేశారు.

సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకం


సత్కారం పొందిన ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో గురువారం గురు పూజోత్సవం నిర్వహించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న నాగూర్ మీరా సాహెబ్, గొల్లపల్లి రామారావు, కొమ్మోజు వెంకటేశ్వరరావు, గుజ్జు నాగసుధలతో పాటు ఒక్కో పాఠశాల సముదాయం నుంచి ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులను ఎంపిక చేసి సత్కరించారు. సర్పంచి సింధు, ఎంపీడీవో రాజ్‌మనోజ్, ఇన్‌ఛార్జి తహసీల్దారు దుర్గాప్రసాద్, ఎంఈవోలు రవీంద్రభారతి, భాస్కర్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

నిడమర్రు గ్రామీణం, గణపవరం, న్యూస్‌టుడే: నిడమర్రు మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం గురు పూజోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. పిప్పరలో గురు పూజోత్సవం నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే పత్సమట్ల సత్కరించారు. ఎంఈవో పి.శేషు, నాయకులు ఇందుకూరి రామకృష్ణంరాజు, తోట శ్రీను, వంగా రఘు తదితరులు పాల్గొన్నారు.

బస్సు పాస్‌లు పంపిణీ.. ఉంగుటూరు, న్యూస్‌టుడే: తల్లిదండ్రుల పేరిట విద్యాభివృద్ధికి పాటుపడటం అభినందనీయమని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఉంగుటూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు సమీప గ్రామాల నుంచి వచ్చే 150 మంది విద్యార్థులకు రెడ్డి సూర్యచంద్రరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రెడ్డి చందు ఆర్థిక సహకారంతో సమకూర్చిన ఆర్టీసీ బస్సు పాస్‌లను గురువారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం దాత చందును సత్కరించారు. సర్పంచి బండారు సింధు, తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి, హెచ్‌ఎం మీనాకుమారి, తెదేపా, జనసేన మండల అధ్యక్షులు పాతూరి విజయ్ కుమార్, పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం ధ్యేయంగా పాలన.. నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమం ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగుతోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం నిడమర్రులో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం'లో ఆయన మాట్లాడారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ముత్యాల స్వామి, దొరబాబు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం: గన్ని


వినతులు స్వీకరిస్తున్న వీరాంజనేయులు, మంతెన

భీమడోలు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. పార్టీ ఆదేశాల మేరకు మంగళగిరిలోని తెదేపా రాష్ట్ర కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజుతో కలిసి గన్ని గురువారం పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించినట్లు వీరాంజనేయులు తెలిపారు.

జవాబుదారీతనమున్న మంచి ప్రభుత్వమిది.. రాష్ట్రం సమగ్రాభివృద్ధి, పేదలకు మంచి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. గురువారం పోలసానిపల్లిలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని కూటమి నాయకులతో కలిసి ఆయన నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ వంద రోజుల పాలన ప్రగతి నివేదికలు పంపిణీ చేశారు. తెదేపా, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గ్రామసభలు సమర్థంగా నిర్వహించాలి

దెందులూరు, న్యూస్‌టుడే: గ్రామసభలు సమర్థంగా నిర్వహించాలని గృహ నిర్మాణ సంస్థ పీడీ, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ నెల 28న పంచాయతీల్లో నిర్వహించే గ్రామ సభల గురించి ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో సర్పంచుల అధ్యక్షతన జరిగే సభల్లో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు గ్రామాభివృద్ధి ప్రణాళికలు, మౌలిక సదుపాయాల రూపకల్పన తదితర అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎంపీడీవో శ్రీలత, డిప్యూటీ తహసీల్దార్, గృహ నిర్మాణ సంస్థ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: నగర శివారు తంగెళ్లమూడి ఉపకేంద్రం ద్వారకానగర్ ఫీడర్ పరిధిలోని లునానీనగర్, బీడీ కాలనీ, క్రాంతినగర్, నేతాజీనగర్, రాణీనగర్, బీసీఆర్ కాలనీ, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో చెట్ల కొమ్మల నరకివేత, లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 27న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏలూరు ఈఈ కె.ఎం. అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.



రహదారిపై మురుగు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: వంగాయగూడెంలోని ప్రధాన రహదారిపై మురుగు నీరు ప్రవహిస్తోంది. ఇక్కడ సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేనందున ఇలాంటి పరిస్థితి నెలకొంది. వర్షం కురిసిందంటే చాలు మరింత దారుణంగా ఉంటోంది. మురుగు నీటితో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, రోగాల బారిన పడుతున్నామని సమీప నివాసాల వారు చెబుతున్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు.

మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ఉంగుటూరు, న్యూస్‌టుడే: మండలానికి మంజూరైన గృహాలన్నింటిని మార్చి నాటికి పూర్తి చేయాలని, లేకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సాయం అందదని ఎంపీడీవో రాజ్ మనోజ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో గురువారం 'మన ఇల్లు- మన గౌరవం' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గృహ నిర్మాణ సంస్థ ఏఈ సురేష్ బాబు మాట్లాడుతూ మండలంలో 333 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని, ఇందుకు 12 బృందాలు ఏర్పాటు చేశామన్నారు. డీటీ పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఎంపీడీవో విజయకుమారి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు 'మన ఇల్లు.. మన గౌరవం' కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ సకాలంలో గృహాలు నిర్మించుకోకుంటే కేంద్రం ఇచ్చే నిధులు వెనక్కిపోయే అవకాశం ఉందన్నారు. అందుకే ఈ నెల 28 నుంచి జరిగే మన ఇల్లు.. మన గౌరవం కార్యక్రమం విజయవంతమయ్యేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

స్వచ్ఛ కార్యక్రమాలపై అవగాహన

భీమడోలు, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ నిషేధం, స్వచ్ఛ కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత భాగస్వాములు కావాలని ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం భీమడోలు గీతాంజలి కళాశాలలో స్వచ్ఛ కార్యక్రమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈవోఆర్డీ సుందరి, పంచాయతీ కార్యదర్శి జయరామకృష్ణ, కళాశాల కరస్పాండెంట్ ఎం.గౌతమ్‌కుమార్, ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవకు దాతలు ముందుకు రావాలి: బడేటి

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ప్రజలకు సేవలందించేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బెంచీలు, వ్యాపారవేత్త కె.కె. గుప్తా సహకారంతో నిర్మించిన షెడ్డును గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సేవా కార్యక్రమాల అమల్లో ఏలూరు నియోజకవర్గం రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచేలా ప్రతి ఒక్కరు తోడ్పాటు అందించాలన్నారు. కేకే గుప్తా, ఆసుపత్రి పర్యవేక్షకులు సుధాకర్, డాక్టర్ బంకా రవికుమార్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జయప్రకాష్, తెదేపా నాయకులు చోడే వెంకటరత్నం, పెద్దిబోయిన శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి కృషి.. ఆసుపత్రి అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. గురువారం ఆయన ఆసుపత్రి పర్యవేక్షకులతో మాట్లాడుతూ వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రికి 100 అదనపు పడకలకు అనుమతులొచ్చాయని, త్వరలో అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే తెలిపారు.


షెడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంటి

ప్రజా సంక్షేమం ధ్యేయంగా కూటమి పాలన.. ఏలూరు టూటౌన్ న్యూస్‌టుడే: వంద రోజుల కూటమి పాలన ప్రజా సంక్షేమం ధ్యేయంగా సాగిందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఇది మంచి ప్రభుత్వం ముగింపు కార్యక్రమం గురువారం సాయంత్రం బావిశెట్టివారిపేటలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చంటి మాట్లాడుతూ బావిశెట్టివారిపేట ప్రాంత సమస్యల పరిష్కారానికి రూ.8.50 లక్షలు కేటాయించి పనులు చేయించామని తెలిపారు. అర్హులందరికీ టిడ్కో ఇళ్లు అందిస్తామని వివరించారు. మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ నగర అభివృద్ధికి ఎమ్మెల్యే చంటి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారన్నారు. తొలుత నాయకులు భూలోకమ్మ తల్లిని దర్శించుకున్నారు. నియోజకవర్గ పరిశీలకుడు ఎస్‌కే మీరా, తెదేపా రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, నగర అధ్యక్షుడు పెద్దిబోయిన శివప్రసాద్, నాయకులు చోడే వెంకటరత్నం, ఎస్‌ఎంఆర్ పెదబాబు, బొద్దాని శ్రీను, ఎంఆర్‌డీ బలరాం, లంకపల్లి మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో పారదర్శకత లోపిస్తే చర్యలు


ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

భీమడోలు, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకత లోపిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ రాము అన్నారు. భీమడోలు మండలంలో 2023-24 సంవత్సరం చేపట్టిన పథకం పనుల సామాజిక తనిఖీలపై మండల స్థాయి ప్రజా వేదిక గురువారం నిర్వహించారు. మండలంలో ఉపాధి పథకం, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూఎస్ శాఖల ద్వారా రూ.12.98 కోట్ల విలువైన 1,589 పనులు చేశారు. వాటిపై నిర్వహించిన సామాజిక తనిఖీల్లో పలు అవకతవకలను అధికారులు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పనులకు సంబంధించిన మస్టర్లను మండల స్థాయి అధికారులు పరిశీలించక పోవడం, కొలతల్లో వ్యత్యాసాలు, కూలీల సంతకాలు లేకున్నా వేతనాల చెల్లింపు వంటి తేడాలను గుర్తించిన అధికారులు బాధ్యులైన ఉద్యోగుల నుంచి రూ.90,019 రికవరీ చేయాలని ఆదేశించారు. ఉపాధి పనుల జిల్లా విజిలెన్సు అధికారిణి విజయలక్ష్మి, ఎంపీడీవో పద్మావతిదేవి, ఎంపీపీ కనమాల రామయ్య, ఉపాధి పనుల అంబుడ్స్ పర్సన్ మెహబూబ్ బాషా, సామాజిక తనిఖీ ఎస్సార్పీ బి.సూర్యచక్రం, ఏపీవో పద్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు జట్ల ఎంపిక

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: శనివారపుపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి అండర్-14, 17 విభాగాల్లో యోగా, చదరంగం, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో బాలికల ఎంపిక పోటీలు గురువారం నిర్వహించారు. ఏలూరు నగరం, గ్రామీణ ప్రాంతాల పాఠశాలల నుంచి సుమారు 163 మంది హాజరయ్యారు. యోగా-14, చదరంగం- 10, వాలీబాల్- 24, కబడ్డీ-24, ఖోఖో-24 మంది చొప్పున జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరు త్వరలో జరిగే ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. అండర్-14, 17 విభాగం సమన్వయకర్త పి.పద్మలత, ప్రధానోపాధ్యాయుడు ప్రకాశరావు, ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 మండల సమన్వయకర్త ఎన్.లీలాకుమారి, పీడీ రమేష్, పీఈటీలు భోగలింగేశ్వరరావు, కె.మురళీకృష్ణ, వి.శ్రీనివాస్, బి.గోపాల్, టి.శ్రీనివాస్, మాధవీలత, ప్రసన్నకుమారి, అరుణ, వెంకటరమణ, సునీత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.


ఏలూరు: ఖోఖో ఆడుతున్న బాలికలు


కైకరం: పోటీలు ప్రారంభిస్తున్న పత్సమట్ల

క్రీడలతో ఉజ్వల భవిత.. కైకరం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కైకరంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరికల్లాంటి క్రీడాకారులను వెలికితీయడానికి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు దోహదపడతాయన్నారు. ఎమ్మెల్యే కొద్దిసేపు వాలీబాల్ ఆడి సందడి చేశారు. తొలుత ఎన్‌సీసీ విద్యార్థులు ఆయనకు స్వాగతం పలికారు. సర్పంచి సలగాల గోపి, జడ్పీటీసీ సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీడీవో రాజ్‌మనోజ్, ఎంఈవోలు రవీంద్రభారతి, భాస్కరరావు, హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు, పోటీల సమన్వయకర్త బి.లక్ష్మీనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కాశిపాడులో 'పొలం పిలుస్తోంది'

గణపవరం, న్యూస్‌టుడే: వ్యవసాయంలో మంచి దిగుబడులు సాధించేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమం దోహదపడుతుందని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు పి.మురళీకృష్ణ అన్నారు. కాశిపాడులో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతుల అనుమానాలను నివృత్తి చేశారు. ఈ- పంట నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రసాద్, సర్పంచి తెర్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటిద్దాం.. గణపవరం, న్యూస్‌టుడే: గణపవరం డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం విద్యార్థులు ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించేందుకు గురువారం మానవహారం ఏర్పాటు చేశారు. పచ్చదనాన్ని కాపాడుకోవడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామంటూ నినాదాలు చేశారు. కళాశాల ప్రిన్సిపల్ నిర్మలాకుమారి భారత్ టోపీలు, డైరీలలను విద్యార్థులకు అందజేశారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారి వెంకటరమణ, అక్కిరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వీయ సామర్థ్యాలను పెంచుకోవాలి.. ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: విద్యార్థులు స్వీయ సామర్థ్యాలను పెంచుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుభూషణరావు అన్నారు. గాంధీనగర్ నగర పాలకోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. సెట్‌వెల్ సీఈవో ప్రభాకరరావు, మేనేజరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవి ఇవి అన్నీ

ధాన్యం కొనుగోలుపై శిక్షణ.. గణపవరం, న్యూస్‌టుడే: గణపవరం మండల పరిషత్తు సమావేశ మందిరంలో గురువారం పంట కోత ప్రయోగం, ధాన్యం కొనుగోలుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దారు అప్పారావు మాట్లాడుతూ సాధారణ ధాన్యం క్వింటాకు రూ.2300, ఏ గ్రేడ్‌కు రూ.2320 కనీస మద్దతు ధరను ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. వ్యవసాయాధికారి ప్రసాద్ మాట్లాడుతూ రైతులు ధాన్యం విక్రయించిన 24 నుంచి 48 గంటల్లో బ్యాంకు ఖాతాల్లో నగదు జమవుతుందన్నారు.

నాణ్యమైన గోనె సంచుల సరఫరా.. ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులు ఇబ్బందులు పడకుండా నాణ్యమైన గోనె సంచులు సరఫరా చేస్తామని ఇన్‌ఛార్జి తహసీల్దారు బొడ్డు దుర్గాప్రసాద్ తెలిపారు. రావులపర్రులోని రైస్ మిల్లును గురువారం ఆయన పరిశీలించారు. అందుబాటులోని గోనె సంచులు, ఆన్‌లైన్ పోర్టల్ రిజిస్ట్రేషన్ వంటి అంశాలపై ఆరా తీశారు. మండలంలో ధాన్యం సేకరణకు 20 లక్షల గోనె సంచులు అవసరం ఉంటుందన్నారు. వీఆర్వో వేణుగోపాల్ పాల్గొన్నారు.



నేడు మండల పరిషత్తు సమావేశం.. ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఉంగుటూరు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజ్‌మనోజ్ తెలిపారు. మండల పరిషత్తు సమావేశ మందిరంలో జరిగే సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక.. ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరులోని వేద పాఠశాలలో ఐక్య బ్రాహ్మణ సేవా సమాఖ్య కార్యవర్గ ఎన్నిక గురువారం నిర్వహించారు. అధ్యక్షుడిగా కందుకూరి రవి, కార్యదర్శిగా ఛత్రపతి మదన్, కోశాధికారిగా భోగరాజు ప్రసాద్‌లను ఎన్నుకున్నారు.

మంత్రికి మొక్క అందజేత.. ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి పార్థసారథిని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వి.శ్రీలక్ష్మి గురువారం ఏలూరులో మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

జూద స్థావరంపై దాడి.. ఉంగుటూరు, న్యూస్‌టుడే: చేబ్రోలులోని సాయింరాంపేటలో జూద స్థావరంపై గురువారం దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చేబ్రోలు పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.46,300 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో అయిదుగురు పరారైనట్లు తెలిసింది.

పోలవరం

•పోలవరం •చింతలపూడి

వైద్య శిబిరాలు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం మెట్టగూడెంలో దొరమామిడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. 28 మందికి పరీక్షలు చేసి చికిత్సలు అందించినట్లు హెల్త్ అసిస్టెంట్ కె.కన్నపరాజు తెలిపారు. వీరిలో ఇద్దరు జ్వరబాధితులు ఉన్నారన్నారు. గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మురుగు కుంటల్లో దోమలు పెరగకుండా రసాయనాలు చల్లారు.

టి.నరసాపురం, న్యూస్‌టుడే: బొర్రంపాలెంలో ఆఫ్రో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. 180 మంది రోగులకు వైద్యులు చందు, వినీల్ పరీక్షలు నిర్వహించి అవసరం అయిన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

ఆలయ హుండీల ఆదాయం లెక్కింపు



జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 90 రోజులకు గాను రూ.6,86,870 సమకూరిందని ఈవో మానికల రాంబాబు తెలిపారు. పర్యవేక్షణాధికారిగా గ్రేడ్-1 ఈవో ఎంఎస్ఎస్ఎస్ శర్మ వ్యవహరించారు. అదే విధంగా ఆలయంలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో వెల్లడించారు.

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం : 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి : 76759 19086

పోలవరం, న్యూస్‌టుడే

సమస్య: పోలవరం పెద్ద రామాలయం వీధిలో పందుల బెడద తీవ్రంగా ఉంది. దుర్గంధం తట్టుకోలేకపోతున్నాం.
-పి.వీరభద్రరావు, పోలవరం

సమాధానం: పందుల యజమానులతో సమావేశం నిర్వహించి వాటిని దూరంగా తరలించేందుకు చర్యలు తీసుకుంటాం.
-వై.కొండలరావు, పంచాయతీ కార్యదర్శి

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: చింతలపూడి మండలం యర్రగుంటపల్లి ఎస్సీ కాలనీలో తాగునీటి పైపులైన్ గేట్ వాల్ మురుగు నీటి మధ్యలో ఉంది. ఈ కారణంగా నీరు కలుషితమవుతోంది. **-రామకృష్ణ, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి గేట్ వాల్‌ను వేరే ప్రాంతంలో ఏర్పాటు చేస్తాం. **-మురళీకృష్ణ, ఎంపీడీవో**

సమస్య: చింతలపూడి చార్లెస్ నగర్‌లో ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి ఇబ్బందులు పడుతున్నాం. దోమలు విజృంభిస్తున్నాయి. **-ఏసుబాబు, స్థానికుడు**

సమాధానం: గడ్డి, పిచ్చి మొక్కలు తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం. **-రాజా, సచివాలయ కార్యదర్శి**

అసౌకర్యాల ప్రాంగణం

కామవరపుకోట (జంగారెడ్డిగూడెం పట్టణం), న్యూస్‌టుడే: మండల కేంద్రం కామవరపుకోట ఆర్టీసీ ప్రాంగణంలో మౌలిక వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కామవరపుకోట చుట్టు పక్కల సుమారు 20 గ్రామాల ప్రజలకు ఇదే ఆధారం. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, నరసాపురం, భీమవరం, తణుకు, ఎన్టీఆర్ జిల్లా తిరువూరు డిపోల నుంచి సుమారు 50 బస్సులకు పైగా ఇటుగా ఇతర ప్రధాన పట్టణాలకు వెళుతుంటాయి. ద్వారకాతిరుమల చిన వేంకన్న ఆలయానికి చేరుకోవాలంటే ఇక్కడికి రావాల్సి ఉంటుంది. రోజూ వెయ్యి మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో 50 మంది మాత్రమే కూర్చునేందుకు వీలుగా రేకుల షెడ్డు నిర్మించారు. అది సరిపోక



నిలబడాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా వర్షాకాలంలో జల్లు పడుతుందని వాపోతున్నారు. బస్టాండ్ ఆవరణ పల్లంగా ఉండటంతో ముంపునకు గురవుతుంటుంది. సైకిల్‌స్టాండ్ లేక వాహనాలు ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న షెడ్డును విస్తరించి, ఆధునికీకరించేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డీఎం గంగాధరరావు తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: జీలుగుమిల్లి మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కృష్ణప్రసాద్ తెలిపారు.

నీటి కోసం ఇక్కట్లు

పోలవరం, న్యూస్‌టుడే: మండలంలోని పట్టిసీమ పంచాయతీ పరిధి బంగారమ్మపేటలో మూడు నెలలుగా నీరు సక్రమంగా రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న మూడింట్లో రెండు మోటార్లు కాలిపోగా ఒకదాని నుంచి అంతంతమాత్రంగా నీరు వస్తోంది. ట్యాంకు పూర్తిగా నిండక గ్రామానికి మొత్తం సరఫరా కావడం లేదంటున్నారు. చేసేది లేక సత్యసాయి పథకం ట్యాంకుల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. పంచాయతీ కార్యదర్శి టి.విజయకుమారి మాట్లాడుతూ నీటి గొట్టాల్లో లీకులతో పాటు కుళాయిలు కట్టకపోవడంతో సమస్య ఏర్పడుతోందన్నారు. వెంటనే పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు.

బొరగానికి అభినందనలు



శ్రీనివాసులును కలిసిన నాయకులు

పోలవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర ట్రైకార్ సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన బొరగం శ్రీనివాసులును పోలవరంలోని ఆయన ఇంటి వద్ద నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల నుంచి వచ్చిన తెదేపా, జనసేన నాయకులు కలిసి గురువారం అభినందనలు తెలిపారు. పూలమాలలు వేసి, శాలువా కప్పి సత్కరించారు. నాయకులు కొణతాల ప్రసాద్, మొగళ్ల హరిబాబు, ఏఎంసీ వెంకటేశ్వరరావు, సీహెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

'కారు ప్రమాదం కేసులో అన్యాయంగా ఇరికించారు'

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం రెడ్డిగూడెం సమీపంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన కారు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటనలో తనను అన్యాయంగా ఇరికించారని, విచారణ చేసి తగిన న్యాయం చేయాలని దొరమామిడికి చెందిన మరువ్వ చింతారావు కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ వజ్రపతిరావుకు కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

వ్యక్తి అదృశ్యం

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన నరం చరణ్‌రాజు స్థానికంగా ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 18న ఇంటి నుంచి విధులకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి చరవాణి సైతం పనిచేయడంలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో భార్య నాగరత్నం గురువారం పోలీసులకు ఆశ్రయించారు.

సీఎం దృష్టికి నియోజకవర్గ సమస్యలు



చంద్రబాబుకు వివరిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, రాంబాబు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పోలవరం నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు శాసనసభ్యుడు చిర్రి బాలరాజు పేర్కొన్నారు. జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో రెండ్రోజులుగా నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, డీసీసీబీ మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబుతో కలిసి గురువారం సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. పోలవరం నిర్వాసితుల సమస్యలతో పాటు ఇతర అంశాలపై ప్రత్యేక ప్రాధాన్య అంశాల వారీగా అన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. అందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తానని చెప్పారని పేర్కొన్నారు. వారి వెంట జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ ఉన్నారు.

శ్రీవారి ఆలయ మెట్లకు పూజలు



పూజలు చేస్తున్న జనసేన శ్రేణులు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూ అపవిత్రమైనందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా ద్వారకాతిరుమల చిన వేంకన్న పాదుకా మండపం వద్ద ఏలూరు జిల్లా జనసేన నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు 108 కొబ్బరికాయలు కొట్టి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దక్షిణ గాలిగోపురం వైపు మెట్లను మోకాళ్లతో ఎక్కుతూ క్షమించు స్వామి అంటూ పసుపు, కుంకుమ రాస్తూ మెట్ల పూజ చేశారు. అనంతరం స్వామివారిని క్షమించమని ప్రార్థించారు. కార్యక్రమంలో సాయి తేజస్విని, కాశీ నరేశ్, కుసుమ కుమారి, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలకు చేరుకున్న మహా పాదయాత్ర.. శ్రీతారా వారాహి లోక కల్యాణార్థ సేవా భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా పాదయాత్ర గురువారం ద్వారకాతిరుమల చిన వేంకన్న సన్నిధికి చేరుకుంది. ట్రస్టు ఛైర్మన్ అవినాష్ దేవిచంద్ర ఆధ్వర్యంలో కల్తీ ప్రసాదం దోషులకు శిక్షలు వేయిద్దాం అంటూ పిఠాపురం నుంచి పాదయాత్ర ప్రారంభమైంది. పాపం పోవాలంటే నిత్యం అఖండ దీపం వెలగాలి అనే నినాదంతో ముందుకు సాగుతోంది.

సంక్షేమం.. అభివృద్ధి వైపు రాష్ట్రం పరుగు



జంగారెడ్డిగూడెం బాలాజీనగర్‌లో కరపత్రాలు ప్రదర్శిస్తున్న రోషన్‌కుమార్

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సంక్షోభంలో ఉన్న రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి వైపు పరుగులు పెడుతుందని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. పట్టణంలోని బాలాజీనగర్‌లో గురువారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వంద రోజుల పాలనలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరిస్తున్నామన్నారు. వైకాపా హయాంలో అప్పులు పెరిగి.. రాష్ట్రం అభివృద్ధిలో 20 ఏళ్లు వెనక్కివెళ్లిందని విమర్శించారు. అనంతరం కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించి.. పంపిణీ చేశారు. నాయకులు మండవ లక్ష్మణరావు, రావూరి కృష్ణ, షేక్ ముస్తఫా, రాజాన సత్యనారాయణ, మద్దిపాటి నాగేశ్వరరావు, కరుటూరి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



సీతంపేటలో..

✦ జంగారెడ్డిగూడెం మండలం తిరుమలాపురం, దేవులపల్లి, పుట్లగట్లగూడెం గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాల్లో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కరపత్రాలు పంచారు. నాయకులు సొయిల సత్యనారాయణ, పారేపల్లి సత్యనారాయణ, శీలం రామచంద్రరావు, కుక్కల మాధవరావు పాల్గొన్నారు.

చింతలపూడి, న్యూస్‌టుడే: ప్రగడవరం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వం 100 రోజుల్లో చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ఎంపీడీవో మురళీకృష్ణ వివరించారు.

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: సీతంపేటలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు కేదాసు రామచంద్రం, శివరామకృష్ణ, అల్లం నారాయణరావు, రాజులపాటి కృష్ణ పాల్గొన్నారు. రామానుజపురంలో నిర్వహించిన కార్యక్రమంలో యర్రంశెట్టి రాజు, ఆదాసి వెంకటశ్రీను, కృష్ణసాగర్, కోనే బాలకృష్ణ పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు, ఎంపికలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. నాలుగు మండలాల పరిధిలో అండర్ 14, 17 విభాగాల్లో ఆయా రకాల పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం పరుగు పందెంలో పాల్గొని విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పోల్నాటి బాబ్జి, నాయకులు మండవ లక్ష్మణరావు, అబ్బిన దత్తాత్రేయ, చెరుకూరి శ్రీధర్, రావూరి కృష్ణ, కరారి వాసు, కరుటూరి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన సాధించాలి.. ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకుని సంఘాలు మరింత ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అన్నారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను గురువారం ప్రారంభించారు. అనంతరం మహిళలు ఏర్పాటు చేసిన దుకాణాలను ఆయన పరిశీలించారు.

రహదారిపై గుంత.. ప్రయాణికుల చింత




చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి మండలం తీగలవంచ శివారులో ప్రధాన రహదారి మధ్యలో ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. దగ్గరకు వచ్చే వరకు కనిపించడంలేదని వాహన చోదకులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాల బారినపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ ప్రాంతంలో ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో చోదకులు గుంతలో కొబ్బరి మట్టలు పెట్టారు. 'గుంత పూడ్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాము'అని ఆర్‌అండ్‌బీ ఏఈ సుందరరావు తెలిపారు.

కర్రతోనే హెచ్చరిక!



జంగారెడ్డిగూడెం పట్టణం, కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జాతీయ రహదారి 516డి కొయ్యలగూడెం-జంగారెడ్డిగూడెం మధ్య వర్షాలకు దెబ్బతింది. కొయ్యలగూడెం బీసీ కాలనీ, నీలాలమ్మ గుడి, పులివాగు శివాలయం సమీపంలో రహదారిపై గోతులు పడ్డాయి. బయ్యనగూడెం శివారు సినిమా హాలు సమీపంలో కల్వర్టు కుంగుతోంది. నరసన్నపాలెం వై-కూడలి దాటాక రహదారిపై పడిన గుంతల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో స్థానికులు హెచ్చరికగా కర్రకు వస్త్రాన్ని కట్టి గుంతలో పాతారు. ఇది కూడా రాత్రి వేళలో ప్రమాదకరంగానే ఉంది. దీనిపై జాతీయరహదారి ఏఈ ఖాజాబాబు మాట్లాడుతూ గోతులకు మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

చెరువు భూమే కదా.. పాగా వేసేద్దాం!



కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: రాజవరం శివారు కేతవరం కూడలి వరకు పెద్దచెరువు భూమి ఆక్రమణకు గురవుతోంది. పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది గ్రామంలో సేకరించిన వ్యర్థాలను రహదారి అంచుల్లో పారబోస్తూ ఆ ప్రాంతాన్ని డంపింగ్ యార్డుగా మార్చారు. దీంతో అక్కడ మట్టిని పోసి పొక్లెయిన్‌తో చదును చేశారు. కేతవరం కూడలిలో రహదారి మలుపులోని గుంతలను కొందరు చెరువు మట్టితో నింపారు. కూడలి నుంచి రాజవరం గ్రామం వైపు సుమారు 400 మీటర్ల వరకు చెరువు భూమి వెంట ఉన్న రహదారి అంచులను సుమారు 15 మీటర్ల పైనే వెడల్పున మెరక చేసి చదును చేశారు. ఆక్రమణల సమాచారం తెలిసినా పంచాయతీ యంత్రాంగం, జలవనరుల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అటు యర్రంపేటలోనూ శివాలయం సమీపంలో చెరువు భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

అంతర్జాల మోసాలపై అప్రమత్తత అవసరం



సదస్సులో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: అంతర్జాల మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ బి.వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు జీలుగుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. నేరగాళ్లు పంపించే లింకులు తెరవడం ద్వారా ఖాతాల్లో డబ్బు మాయమవుతుందని చెప్పారు. అలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. యువకులు ఆన్‌లైన్ ఆటల మోజులో పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ప్రసంగాన్ని టీవీ ద్వారా వినిపించారు. కార్యక్రమంలో ఎస్సై నవీన్‌కుమార్, ప్రిన్సిపల్ సతీశ్ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: కోయరాజమండ్రి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేసి తెలియజేస్తే సహాయ, సహకారాలను అందిస్తామని ఎస్సై దుర్గామహేశ్వరరావు తెలిపారు.

వేధింపులు అరికట్టాలని ఆందోళన



నినాదాలు చేస్తున్న ఆశా కార్యకర్తలు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: రాజకీయ నాయకుల ప్రోద్బలంతో వైద్య సిబ్బంది తమను వేధిస్తున్నారని ఆరోపిస్తూ మండలంలోని ఆశా కార్యకర్తలు టి.నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కక్ష సాధింపులో భాగంగా వైద్య సిబ్బంది గండిగూడెం ఆశా కార్యకర్త లక్ష్మీమంగను విధుల నుంచి తొలగించడం విచారకరమన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఉద్యోగికి వైద్యాధికారులు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. వెంటనే అతడితో పాటు సహకరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పీహెచ్‌సీ, రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయాల సిబ్బందికి వినతి పత్రాలు ఇచ్చారు. ఈ విషయమై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు కల్పనారాణి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఆందోళన గురించి తనకు తెలియదని ముక్తసరిగా సమాధానమిచ్చారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు విజయలక్ష్మి, వనిత, జ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కామవరపుకోట (జంగారెడ్డిగూడెం పట్టణం), న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలకు కామవరపుకోట మండలం ఆడమిల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు జి.అనూష, ఆర్.మౌనిక, ఎస్కే ఫైజన్ వలీ, సీహెచ్ నాగసాయి, కె.పూజితలు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.విజయభారతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

లింగపాలెం, న్యూస్‌టుడే: కొత్తపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన అయిదుగురు విద్యార్థులు సాఫ్ట్ బాల్, బేస్ బాల్ అండర్-14, 17 విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కామేశ్వరరావు తెలిపారు. అండర్-14, 18 విభాగంలో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రంగాపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన అయిదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం.లక్ష్మీ పేర్కొన్నారు.



ఆడమిల్లి విద్యార్థులతో ప్రధానోపాధ్యాయిని విజయభారతి, పీడీ సుబ్బారావు



రంగాపురంలో..

టి.నరసాపురం, న్యూస్‌టుడే: అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాల విద్యార్థులు 16 మంది ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానాచార్యులు శంకరరావు తెలిపారు. ✪ బేస్‌బాల్ అండర్-14 విభాగంలో కేతవరం ఉన్నత పాఠశాల విద్యార్థిని కొలుకులూరి హేమశ్రీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీ అప్పారావు పేర్కొన్నారు.



అప్పలరాజుగూడెంలో..

'అలుపెరగని పోరాట యోధుడు ఆర్‌ఎస్'



సత్యనారాయణరాజుకు నివాళులర్పిస్తున్న సీతారాం తదితరులు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడంతో పాటు చిన్నతనంలోనే కమ్యూనిస్టు ఉద్యమంలో చేరి పేదల పక్షాన అలుపెరగని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి రుద్రరాజు సత్యనారాయణ రాజు(ఆర్‌ఎస్) అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం అన్నారు. పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాలులో ఆర్‌ఎస్ సంస్మరణ సభ సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో కమ్యూనిస్టు పార్టీలను ఏకం చేయడం, ఏజెన్సీలో భూ ఉద్యమాలు నిర్వహించి గిరిజనులకు వేలాది ఎకరాలు పంపిణీ చేయడంలో ఆర్‌ఎస్ ఎనలేని కృషి చేశారన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.జీవరత్నం, దుర్గారావు, అందుగుల ఫ్రాన్సిస్, రాంబాబు, సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా జ్యోతి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం ఎంపీడీవోగా కుంజా జ్యోతి నియమితులయ్యారు. ఆమె వీరవాసరంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న వేణుగోపాలరెడ్డిని తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లికి బదిలీ చేశారు.

దూరవిద్యపై అవగాహన

లింగపాలెం, న్యూస్‌టుడే: చదువుకోని, మధ్యలో ఆపేసిన వారికి దూర విద్యా విధానం ద్వారా ప్రభుత్వం అవకాశాన్ని కల్పిస్తోందని సమగ్ర శిక్షా ఇన్‌ఛార్జి సీఎంవో, లింగపాలెం ఎంఈవో-2 జంగం రవీంద్ర అన్నారు. ఈ మేరకు శింగగూడెం జిల్లా పరిషత్తు పాఠశాలలో గురువారం గ్రామస్థులు, డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించారు. తక్కువ రుసుముతో పది, ఇంటర్ పరీక్షలు రాసే అవకాశం ఉందన్నారు. దివ్యాంగులకు రాయితీ ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల సేవలో సహకార సంఘాలు



మధ్యాహ్నపువారిగూడెంలో మాట్లాడుతున్న సీఈవో భుజంగరావు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: రైతులకు చేయూతనందిస్తూ సహకార సంఘాలు ముందుకు సాగుతున్నాయని మధ్యాహ్నపువారిగూడెం, మక్కినవారిగూడెం సంఘాల సీఈవోలు భుజంగరావు, సత్యనారాయణ అన్నారు. ఆయా గ్రామాల్లో పీఏసీఎస్‌ల వద్ద గురువారం ఛైర్మన్ ఏసుకుమార్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల జమా ఖర్చులు, తనిఖీ నివేదికలను సభలు ఆమోదించాయి.

రూ.52 కోట్ల నష్టం.. టి.నరసాపురం పీఏసీఎస్ రూ.52 కోట్ల నష్టాల్లో ఉందని ఛైర్‌పర్సన్ మాధవి అన్నారు. ఈ సంఘ మహాజన సభ గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపాజిట్ దారులు తమ నగదుకు వడ్డీ లేదా పూర్తి మొత్తం చెల్లించాలని లేదా క్రమబద్ధీకరించాలని కోరారు. ఆమె మాట్లాడుతూ కుదరదన్నారు. రుణాలు చెల్లించని వారి భూములు విక్రయించి నగదు చెల్లిస్తామని తెలిపారు. సమావేశంలో సీఈవో ఆగస్టీన్, రైతులు పాల్గొన్నారు.

అవి ఇవి అన్నీ

నిర్దేశిత ప్రమాణాల మేరకు ధాన్యం విక్రయాలు.. జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల మేరకు రైతులు ధాన్యం విక్రయించుకోవాలని తహసీల్దార్ స్లీవజోజి అన్నారు. పంగిడిగూడెంలో ధాన్యం కొనుగోలుపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ప్రభుత్వం క్వింటా రూ.2300గా నిర్దేశించిందన్నారు.

28న ఇస్రో కార్యకలాపాలపై ప్రదర్శన.. జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: భారత అంతరిక్ష మిషన్ సమాచారం, ఇస్రో కార్యకలాపాలు విద్యార్థులకు తెలియజెప్పాలనే ఉద్దేశంతో రూపొందించిన ఇస్రో ప్రదర్శన వాహనాన్ని ఈ నెల 28న పట్టణంలోని జిల్లాపరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో ఉంచనున్నట్లు ఎంఈవోలు రాముడు, రాములు ఓ ప్రకటనలో తెలిపారు.

పొగాకు రైతుల్లో ఆనందం.. జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ఈ సీజన్‌లో మంచి ధర లభించడంతో పొగాకు రైతులు ఆనందంగా ఉన్నారని జంగారెడ్డిగూడెం రెండో వేలం కేంద్రం నిర్వహణాధికారి జె.సురేంద్రకుమార్ అన్నారు. వర్జీనియా పొగాకు కొనుగోళ్లు ముగింపు సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15.15 మిలియన్ కేజీల పొగాకును కొనుగోలు చేశామని, కిలోకు అధిక ధర రూ.411 దక్కిందన్నారు. అనంతరం బోర్డు సిబ్బంది, కంపెనీల ప్రతినిధులను రైతులు సన్మానించారు.

సభ్యత్వ నమోదుపై శిక్షణ.. కామవరపుకోట (జంగారెడ్డిగూడెం పట్టణం), న్యూస్‌టుడే: తెదేపా కామవరపుకోట కార్యాలయం వద్ద తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమంపై మండల అధ్యక్షుడు కిలారి సత్యనారాయణ అధ్యక్షతన శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త వాక కల్యాణ్‌శివకుమార్ శిక్షణ ఇచ్చారు. నాయకులు సిరిబత్తుల నాగరాజు, పసుపర్తి పార్థసారథిబాబు, మద్దిపాటి నాగలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం జాబితా కోసం ఆరా .. పోలవరం, న్యూస్‌టుడే: భారీ వర్షాలు, వరదలకు పంటలు నష్టపోయిన పోలవరానికి చెందిన పలువురు రైతులు పరిహారం కోసం గురువారం తహసీల్దార్ సాయిరాజును కలిశారు. ఆయన సూచనతో వ్యవసాయాధికారి కె.రాంబాబును కలిసి జాబితా గురించి ఆరా తీశారు.

ఒప్పంద ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్.. బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 11 ఉపాధ్యాయ ఖాళీల్లో ఒప్పంద రెసిడెన్షియల్ టీచర్స్ (సీఆర్టీ)లను సర్దుబాటు చేసేందుకు కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద గురువారం సాయంత్రం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏపీవో, ఇన్‌ఛార్జి డీడీ పీవీఎస్ నాయుడు, ఇన్‌ఛార్జి డీవైఈవో కలుము నీలయ్య, ఏఎంవో కొవ్వాసి శిరమయ్య పాల్గొన్నారు.

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

రాకపోకల పునరుద్ధరణ



ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు నుంచి వలసపల్లి వైపు వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన మార్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారి కోతకు గురైన విషయం తెలిసిందే. స్థానిక రైతులు, స్థానికులు పంట పొలాల్లోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని గ్రహించి గండి పడిన ప్రదేశంలో తాత్కాలికంగా మరమ్మతులు చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. గురువారం ఆర్‌అండ్‌బీ ఏఈ అశోక్‌బాబు రూ.2 లక్షల నిధులతో తాత్కాలిక రహదారి నిర్మాణానికి పనులు చేయించారు. అనంతరం రాకపోకలు పునరుద్ధరించారు.

ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే ధైర్యంగా చెప్పండి: సీఐ

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: బాలికలను ఎవరైనా ఇబ్బందులు పెట్టినా, వేధింపులకు గురి చేసినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకు రావాలని సీఐ కె.రామకృష్ణ సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆగిరిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 'మన పోలీసు-మన రక్షణ' లో భాగంగా విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్సై కె.శుభశేఖర్, హెచ్‌ఎం పి.పుష్పలత, ఏఎస్సై టి.నాయక్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న రామకృష్ణ, పక్కన ఎస్సై శుభశేఖర్

సనాతన ధర్మాన్ని సంరక్షించుకోవాలి

మండవల్లి, న్యూస్‌టుడే: సనాతన ధర్మాన్ని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని భాజపా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కీర్తి వెంకటరాంప్రసాద్, శిర్డీ భక్త సమాజం సమన్వయకర్త గుడివాడ చిట్టిబాబు, శివశక్తి మండలాధ్యక్షుడు కనకారావు అన్నారు. గత ప్రభుత్వం తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీ చేయడాన్ని నిరసిస్తూ హిందూ ధర్మ పరిరక్షణ ఆధ్వర్యంలో గురువారం మండవల్లిలో భారీ ర్యాలీ నిర్వహించారు. శ్రీనివాసరావు, చలపతిరావు, గురుస్వామి ఆజాద్, ఏసుబాబు, రాంబాబు, నాని, ఆంజనేయులు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



హిందూ ధర్మ పరిరక్షణ సంఘ నాయకుల ప్రదర్శన

'తిరుమలను వైకాపా భ్రష్టు పట్టించింది'

కైకలూరు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ పాలనలో తిరుమలకు వచ్చే భక్తులకు దర్శనం, సౌకర్యాలు కల్పించడం.. ప్రభుత్వం అందించే లాంఛనాలు వంటి అనేక కార్యక్రమాల్లో నియంత పోకడలను అవలంబించి భ్రష్టు పట్టించిందని జనసేన నేత కొల్లి వరప్రసాద్ ఆరోపించారు. తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించి అపవిత్రం చేసిన నేపథ్యంలో కైకలూరు శ్యామలాంబ అమ్మవారు, మీసాల వేంకటేశ్వరస్వామి దేవస్థానాల్లో ప్రాయశ్చిత్త మహాచండీ యాగం నిర్వహించారు. రెండు దేవస్థానాల్లో కూటమి నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు జరిపించారు. కూటమి నాయకులు పూల రామచంద్రరావు, నల్లగోపుల చలపతి, గంగునేని వరప్రసాద్, సూర్య ప్రకాష్, రాజేశ్వరి, సాయి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రాయశ్చిత్త మహాచండీ యాగం చేస్తున్న వరప్రసాద్

ఏ ఇంట చూసినా.. ఒళ్లు నొప్పులే!

★ జ్వర బాధితులతో కిటకిటలాడుతున్న ఆసుపత్రులు
★ రోగ నిర్ధారణ పరీక్షల పేరుతో దోపిడీ

నూజివీడు, న్యూస్‌టుడే: వర్షాల ప్రభావం, వాతావరణ మార్పులతో విషజ్వరాలు పల్లెలు, పట్టణాల్లో విజృంభిస్తున్నాయి. నూజివీడు డివిజన్‌లో ఆసుపత్రులు, రోగ నిర్ధారణ కేంద్రాలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. సాధారణంగా జ్వరాలు వస్తే వాటి లక్షణాల ఆధారంగా అది ఏ రకమో వైద్యులు ఒక అంచనాకు వస్తారు. కొద్దిరోజులుగా నూజివీడు డివిజన్‌లో ప్రబలుతున్న జ్వరాలు గందరగోళానికి గురి చేస్తున్నాయి. వైరస్ కారణంగా జ్వరాలు వ్యాపిస్తున్నాయని గుర్తించినా.. వ్యాధి కారక వైరస్ ఏంటనేది తెలియడం లేదు. శరీరంలో అన్ని అవయవాలపై ప్రభావం చూపుతుండటంతో ప్రజలు భయపడుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది ఇంటింటా సర్వే చేస్తున్నా. పరిస్థితి అదుపులోకి రావడం లేదు. జ్వరం తగ్గిన వారికి తీవ్రమైన శరీర నొప్పులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెద్ద ఎత్తున వసూలు..

ఈ సీజన్‌లో జలుబు, జ్వరాలకు తోడు ఒళ్లు నొప్పులు, టైఫాయిడ్, మలేరియా, డెంగీ లక్షణాలు ఎక్కువగా ఉండటంతో వైద్య పరీక్షల పేరుతో రక్త పరీక్ష కేంద్రాల నిర్వాహకులు పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నారు. ఆసుపత్రులకు వెళ్లగానే డెంగీ లక్షణాలు ఉన్నాయంటూ.. వ్యాధి నిర్ధారణకు పలు రక్త పరీక్షలు చేస్తూ రూ.1500 వరకు వసూలు చేస్తున్నారు.

ముసునూరు మండలం లోపూడికి చెందిన రాంబాబు ఇద్దరు చిన్నారులకు జ్వరం, వంటిపై పొక్కులు వచ్చాయి. దీంతో రెండు రోజులుగా నూజివీడు ఏరియా ఆసుపత్రి చుట్టూ తిరుగుతున్నామని చెప్పారు.



రెడ్డిగూడేనికి చెందిన భారతి రెండేళ్ల మనవరాలికి తరచూ జ్వరం వస్తోందని, కూతురికి కూడా జ్వరం వస్తోందని నూజివీడు ఏరియా ఆసుపత్రికి వచ్చినట్లు పేర్కొన్నారు.





☛ నూజివీడుకు చెందిన 32 ఏళ్ల యువకుడికి గత నెల 21న వైరల్ జ్వరం వచ్చింది. నాలుగైదు రోజుల్లో జ్వరం తగ్గింది. ఆ తర్వాత శరీరంలో ఒంటి నొప్పులు తీవ్రమయ్యాయి. వారం రోజుల పాటు అడుగు తీసి అడుగు వేయలేక పోయారు. అనంతరం భుజం, కీళ్ల నొప్పులతో సతమతమవుతున్నారు. నెలరోజులు పూర్తయినా కోలుకోలేకపోతున్నారు.

☛ ఆగిరిపల్లికి చెందిన 52 ఏళ్ల వ్యక్తికి అకస్మాత్తుగా తీవ్ర కీళ్ల నొప్పులు, జ్వరం మొదలయ్యాయి. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. డెంగీ వచ్చిందేమోనని భయపడ్డాడు. ఆసుపత్రికి వెళ్తే వైద్యులు అన్ని రకాల పరీక్షలు చేసి డెంగీ కాదని, వైరల్ జ్వరమని తేల్చి మందులిచ్చారు.

చర్యలు తీసుకుంటున్నాం..

జ్వరాల బారిన పడిన వారికి ఒంటి నొప్పుల కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సారి కొత్తగా గన్యా మాదిరిగా అధికంగా కీళ్ల నొప్పులు వస్తున్నాయి. పోషకాహారం తీసుకోవాలి. కాల్షియం తగ్గకుండా చూసుకోవాలి. ఎముకలు, కీళ్ల నొప్పుల నుంచి కోలుకోవడానికి ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలి. జ్వరాలు అదుపులోకి తెచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

\- ఆర్.లక్ష్మీనారాయణరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో, నూజివీడు

డివిజన్‌లో జ్వరాల నమోదు ఇలా.. (సెప్టెంబర్ 26వ తేదీ వరకు)

డెంగీ	07
మలేరియా	00
టైఫాయిడ్	349
ఇతర	1854

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు : 99486 40551 | కైకలూరు: 73060 88555
ముసునూరు : 93983 81268 | కలిదిండి: 90594 84862

ముసునూరు, న్యూస్‌టుడే

సమస్య: నూజివీడు మండలం పోతురెడ్డిపల్లి శివారు వద్ద ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి మధ్యలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కుంగింది. దీంతో ఆ ప్రదేశంలో రంధ్రం పడి పెద్ద గుంత ఏర్పడింది. రాత్రి సమయంలో అటుగా ప్రయాణించే వాహనదారులకు గొయ్యి కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.

\- పి.కోటయ్య, ముసునూరు

సమాధానం: గుంత పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

\- అశోక్‌బాబు, ఆర్‌అండ్‌బీ, ఏఈ



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

బాల్య వివాహ వ్యవస్థపై పోరాడాలి

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: బాల్య వివాహ వ్యవస్థకు వ్యతిరేకంగా విద్యార్థి దశ నుంచే పోరాడాలని చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త ఆర్.వినోద్‌కుమార్ అన్నారు. నూజివీడు పట్టణంలో డీఏఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో బాల్య వివాహాలతో జరిగే దుష్పరిణామాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాలకు ఎవరైనా పాల్పడితే 1098 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. అనంతరం బాల్య వివాహానికి వ్యతిరేకంగా విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఎన్‌సీసీ మనోహర్, కళాశాల ప్రిన్సిపల్ వి.కిరణ్‌కుమార్, కె.కృష్ణవేణి పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ

ముదినేపల్లి, న్యూస్‌టుడే: మాజీ ఉపసభాపతి, తెదేపా సీనియర్ నాయకుడు బూరగడ్డ వేదవ్యాస్ జన్మదిన వేడుకలను గురువారం ముదినేపల్లిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఐటీఐ కళాశాలలో ఆయన అభిమానులు కేకు కోసి పంచారు. అనంతరం స్థానిక ఆసుపత్రులలో రోగులు, వృద్ధులు, పేదలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ కొనపరెడ్డి సత్యనారాయణ, వైద్యులు అంబుల మనోజ్, శివ, మణి తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన ఇలా..

చాట్రాయి, న్యూస్‌టుడే: చాట్రాయి మండలంలో శుక్రవారం మంత్రి పార్థసారథి పర్యటన చేయనున్నారు. తుమ్మగూడెం, కొత్తగూడెం, మర్లపాలెం గ్రామాల్లో సిమెంటు రహదారుల శంకుస్థాపన, ప్రజా వేదికలో ఆయన పాల్గొంటారని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: ఎస్సీ, బీసీ వెనుకబడిన వర్గాల ప్రజలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. బుధవారం రాత్రి నూజివీడు పట్టణం రోటరీ క్లబ్ ఫంక్షన్ హాలులో పశుసంవర్ధకశాఖ, జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో ఔత్సాహిక రైతులు, నిరుద్యోగులకు ప్రభుత్వ రుణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సన్న, చిన్న కారు రైతులు, చేతి వృత్తి, చిరు వ్యాపారులకు అనేక రుణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిపై అవగాహన పెంచుకొని రుణాలు పొంది వ్యాపారాభివృద్ధి చేసుకుని ఆర్థికంగా ఎదగాలని రైతులకు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

ఇస్రో కార్యకలాపాలపై ప్రదర్శనకు ఏర్పాట్లు

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: భారతీయ విజ్ఞాన మండలి, విజ్ఞాన భారతి, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో ఇస్రో కార్యకలాపాలపై ప్రదర్శన బస్సు శుక్రవారం నూజివీడు రానుంది. డీవైఈవో సేవ్యా నాయక్ మాట్లాడుతూ.. విద్యార్థి దశలో అంతరిక్ష యాత్రల సమాచారం, వివిధ ఉపగ్రహాల నమూనాలు, ఇస్రో భవిష్యత్తు ప్రణాళికల గురించి సాంకేతిక నిపుణులు విద్యార్థులకు వివరించనున్నట్లు చెప్పారు. శుక్రవారం నూజివీడు పట్టణంలోని సెయింట్ థామస్ హైస్కూల్ ఆవరణలో బస్సు ఏర్పాటు చేస్తామన్నారు.

ఐలమ్మ పోరాటం అనిర్వచనీయం

కైకలూరు, న్యూస్‌టుడే: భూస్వాముల నుంచి పేదల భూములను సంరక్షించేందుకు ఐలమ్మ చేసిన పోరాటం అనిర్వచనీయమని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు అన్నారు. ఐలమ్మ జయంతిని నియోజకవర్గ రజక సంక్షేమ సంఘం అధ్యక్షుడు కందుల రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈమేరకు స్థానిక కలిదిండి రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కూటమి, బీసీ, రజక నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పి.లక్ష్మిరాణి, బి.విజయలక్ష్మి, వీరాంజనేయులు, సుధ, జి.వరప్రసాద్, తలారి రాజేశ్, ఏసురత్నం, పెద్దిరాజు, నాగేశ్వరరావు, శ్రీనివాస్, చంటి, బాలాజీ, వెంకటేశ్వరరావు, పవన్ తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కూటమి, రజక సంఘం నాయకులు

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు పురపాలక సంఘం కార్యాలయంలోని కౌన్సిల్ మందిరంలో శుక్రవారం కౌన్సిల్ సాధారణ సమావేశం సాయంత్రం మూడు గంటలకు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ రామిరెడ్డి తెలిపారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: చిరు ధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సర్పంచి పరసా విశ్వేశ్వరరావు అన్నారు. శ్రీహరిపురం శివారు చేవూరుపాలెంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా పోషకాహార ప్రాముఖ్యంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజూ ఆహారంలో చిరు ధాన్యాలు, పప్పు, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సిహెచ్.ప్రసూన, కార్యదర్శి అప్పారావు, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.



చేవూరుపాలెంలో సీమంతాలు చేస్తున్న సిబ్బంది

అస్తవ్యస్త పనులతో ఇక్కట్లు

చాట్రాయి, న్యూస్‌టుడే: ప్రజలకు నాణ్యమైన తాగునీటిని కుళాయి ద్వారా అందించాలనే లక్ష్యంతో 'జల్ జీవన్ మిషన్' ఆధ్వర్యంలో చేపట్టిన పనులు అస్తవ్యస్తంగా మారాయి. వీటి కోసం అక్షరాల రూ.95 లక్షలు ఖర్చు చేశారు. ప్రధాన రహదారిలో పైపులైన్లకు లీకేజీలు నిత్యకృత్యంగా మారాయి. వీటి నుంచి వస్తోన్న నీరు వృథాగా పోతోంది. పనులను పర్యవేక్షించాల్సిన గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారుల నిర్లక్ష్యం నేడు గ్రామ పంచాయతీలకు ఇక్కట్లు తెచ్చి పెడుతోంది.



చనుబండ కూడలిలో పైపు లీకేజీ

ప్రధాన రహదారికి ఇరువైపులా..

రాష్ట్రీయ రహదారిలో ఉన్న చనుబండలో ప్రధాన రహదారికి ఇరువైపులా పైపులైన్లు ఏర్పాటు చేశారు. వీటిలో లీకేజీ నీటితో ఇటీవల సిమెంట్ లారీ దిగబడింది. దీంతో వారు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఈ గ్రామంలోని చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంది. కొన్ని గ్రామాల్లో కుళాయిలు ఏర్పాటు చేయకుండా కేవలం కర్రలు కట్టి మమ అనిపించారు. ఫలితంగా ప్రస్తుతం నీరు వృథా అవుతోంది. దీనిపై గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ రఘును సంప్రదించగా - పరిశీలించి సమస్యను వెంటనే పరిష్కరిస్తామన్నారు. పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.



కాలువలా వస్తోన్న నీరు

దసరాకు ముస్తాబవుతున్న నూజివీడు

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణం దసరా ఉత్సవాలకు ముస్తాబవుతోంది. పట్టణంలోని కోట మహిషాసురమర్దని అమ్మవారి ఆలయాన్ని అందంగా అలంకరించారు. పూజలకు సిద్ధం చేస్తున్నారు. అక్టోబర్ 3 నుంచి 12 వరకు దసరా మహోత్సవాలు జరుగనున్నాయి. ఏటా మాదిరిగానే ముందుగానే దసరా సంబరాలు నిర్వహించేందుకు పట్టణంలోని హనుమాన్ జంక్షన్ రహదారిలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయాలకు రంగులు వేసి, విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. దసరా ఉత్సవాల్లో జాతీయ స్థాయిలో నూజివీడు రెండో మైసూరుగా ఖ్యాతి చెందింది.

ఏర్పాట్లు చేశాం.. కోట మహిషాసురమర్దని అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో అలివేణిశ్రీ తెలిపారు. ఇప్పటికే విద్యుత్తు దీపాల ఏర్పాటు, రంగులు వేయడం, పందిరి వంటి కార్యక్రమాలు పూర్తి చేసినట్లు చెప్పారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.



విద్యుత్తు దీపాల అలంకరణలో అమ్మవారి ఆలయం

ఉపాధి పనుల్లో పారదర్శకత లోపిస్తే చర్యలు

భీమడోలు, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకత లోపిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ రాము అన్నారు. భీమడోలు మండలంలో 2023-24 సంవత్సరంలో చేపట్టిన పథకం పనులపై సామాజిక తనిఖీలపై మండల స్థాయి ప్రజా వేదిక గురువారం నిర్వహించారు. మండలంలో ఉపాధి పథకం, పంచాయతీరాజ్, హార్టికల్చర్ శాఖల ద్వారా రూ.12.98 కోట్ల విలువైన 1,589 పనులు చేశారు. వాటిపై నిర్వహించిన సామాజిక తనిఖీల్లో పలు అవకతవకలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఉపాధి పనుల జిల్లా విజిలెన్సు అధికారిణి విజయలక్ష్మి, ఎంపీడీవో పద్మావతిదేవి, ఎంపీపీ కనమాల రామయ్య తదితరులు పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న జమలయ్య

భవిత కేంద్రం పరిశీలన

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణంలోని భవిత కేంద్రాన్ని ఎంఈవో-2 జమలయ్య గురువారం పరిశీలించారు. భవిత కేంద్రంలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం, రక్షిత తాగునీరు పరిశీలించారు. భవిత కేంద్రం అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు వితరణ

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం లోకుమూడి వెల్‌నెస్, అంగన్‌వాడీ కేంద్రాలకు దాత పోలవరపు శ్రీరామ్ రెండేసి పంకాలు (సీలింగ్ ఫ్యాన్లు) వితరణగా ఇచ్చారు. తెదేపా నాయకుడైన తన తండ్రి పోలవరపు కిశోర్ జ్ఞాపకార్థం వీటిని అందించినట్లు తెలిపారు. కూటమి నాయకులు సమయం ఏసుబాబు, బాషా, వెంకటరత్నం, బోను ఈశ్వరరావు దాతను అభినందించారు.

కూటమి పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం

కైకలూరు, న్యూస్‌టుడే: కూటమి పాలనలో అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతోందని తెదేపా మండలాధ్యక్షుడు పెన్మత్స త్రినాథరాజు, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బొమ్మనబోయిన విజయలక్ష్మి అన్నారు. స్థానిక వెలమపేట కాలనీలో గురువారం కూటమి శ్రేణులతో కలిసి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వంద రోజుల పాలన గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు పోలవరపు లక్ష్మీరాణి, బంకపల్లి భాస్కరరావు, సీతమ్మ, కారుణ్య గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ తిరుగుతూ..

కలిదిండి, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన అత్యధిక హామీలను అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని నాయకులు అబ్దుల్ అస్లామ్, ఎండీ ఫరూక్, అబ్దుల్ అలీమ్ అన్నారు. కోటకలిదిండిలో గురువారం మన మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. అయూబ్ ఖాన్, ఎండీ జఫ్రుల్లా, షఫీవుల్లా, బహీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



కలిదిండిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

అభివృద్ధి దిశగా అడుగులు.. ముసునూరు, న్యూస్‌టుడే: ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెదేపా నాయకుడు లక్కపాము కాంతారావు అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం లోపూడిలో అధికారులు, నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నక్కా చెన్నారావు, లక్కపాము కాంతారావు, పేరం వెంకటరత్నం, చలమాల గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.



కైకలూరులో..

మరుగుదొడ్డి ఏర్పాటుపై వివాదం

కైకలూరు, న్యూస్‌టుడే: తాత్కాలిక మరుగుదొడ్డి ఏర్పాటుపై కైకలూరు శిర్డీ సాయి ధ్యాన మందిరం భక్తులు, స్థానికుల మధ్య స్వల్ప వివాదం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. పంట కాలువ గట్టుపై ఉన్న సాయిబాబా ఆలయంలో ప్రతి గురువారం భక్తులకు భారీగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈక్రమంలో ఉచిత సేవ చేసేందుకు పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి మహిళా భక్తులు పదుల సంఖ్యలో వస్తుంటారు. అయితే వీరి వ్యక్తిగత అవసరాల కోసం ఆలయం సమీపంలోని పంట కాలువ గట్టుపై తాత్కాలిక మరుగుదొడ్డి ఏర్పాటు చేసేందుకు గురువారం యత్నించగా.. స్థానికులు కొందరు అడ్డుకున్నారు. తాము నివాసాలు ఉంటున్న చెంతనే మరుగుదొడ్లు ఎలా ఏర్పాటు చేస్తారని, మరో ప్రాంతంలో పెట్టుకోవాలని చెప్పడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో జలవనరుల శాఖ, పంచాయతీ, పోలీసు అధికారులు ఇరు వర్గాలకు సర్ది చెప్పి మరో ప్రాంతంలో ఏర్పాటు చేయడంతో వివాదం సద్దుమనిగింది.



ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

ఆగిరిపల్లిలో కిలాడీ మహిళల హల్‌చల్

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: సూపర్ మార్కెట్‌లోకి ముగ్గురు కిలాడీ మహిళలు వెళ్లి సరకులను దొంగిలించిన ఘటన ఆగిరిపల్లిలో కలకలం సృష్టించింది. ఆగిరిపల్లి-గన్నవరం రహదారిలోని ఓ మార్ట్‌లోకి ఈనెల 24న ముగ్గురు మహిళలు సరకులు కొనుగోలు చేసేందుకు వచ్చారు. అయితే ఆ మహిళలు దుకాణంలో కొనుగోలు చేస్తున్నట్లు నటించి కొన్ని సరకులు చోరీ చేశారు. దుకాణంలో సుమారు రూ.20 వేల విలువైన సరకులు చోరీకి గురైనట్లు దుకాణ యజమాని పామర్తి రామ్మోహనరావు సీసీ కెమెరాల ఆధారంగా ఆలస్యంగా గుర్తించారు. దీనిపై గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు.

మేకల కాపరిపై దాడి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: తమ తోటలో మామిడి మొక్కలు నరికి వేశారని ఓ మేకల కాపరిపై పలువురు దాడి చేసిన ఘటన ఇది. ఆగిరిపల్లి మండలం వడ్లమాను గ్రామానికి చెందిన నక్క సుబ్రహ్మణ్యం మేకలను మేపుతూ జీవనం సాగిస్తున్నారు. ఆయన ఈనెల 25న మేకలు మేపేందుకు కొత్త ఈదర వెళ్లారు. తమ తోటలోని మామిడి మొక్కలను నరికి వేశారని.. తోటలో ఉన్న ఆరుగురు సుబ్రహ్మణ్యంపై దాడి చేసి, అతని 50 మేకలను బంధించారు. వారికి నష్టపరిహారం చెల్లిస్తానని చెప్పి వారి నుంచి సుబ్రహ్మణ్యం తప్పించుకుని పోలీసులను ఆశ్రయించారు.

జూదరుల అరెస్టు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి మండలం సీతారామపురంలో ఎస్సై కె.శుభశేఖర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన దాడుల్లో జూదమాడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.17,700 నగదు, 7 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువుల గండ్లు పూడ్చించాలని వినతి

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పలు చెరువులకు ఇటీవల వరదల సమయంలో పడిన గండ్లు త్వరితగతిన పూడ్చించాలని మాజీ ఎమ్మెల్యే మేక వెంకట ప్రతాప అప్పారావు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో భవానీశంకరికి గురువారం వినతిపత్రం అందించారు. అంతకుముందు పట్టణంలోని పెద్ద చెరువు గండి పడిన ప్రాంతం, ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు.

క్రీడలతో ఉజ్వల భవిత

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: క్రీడలతో ఉజ్వల భవిత లభిస్తుందని హెచ్‌ఎం తాడి ప్రసాద్ అన్నారు. ఆగిరిపల్లి మండలం ఈదులగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 12 విద్యార్థులు ఇటీవల జరిగిన అండర్-14, 17 విభాగాల్లో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ క్రీడల్లో సత్తాచాటి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు బాలికల గురుకుల పాఠశాలకు చెందిన 34 మంది విద్యార్థినులు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ కె.ప్రవీణ, వ్యాయామ ఉపాధ్యాయురాలు జి.నాగమల్లేశ్వరి గురువారం తెలిపారు. ఈనెల 20, 21 తేదీల్లో నూజివీడులో జరిగిన పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి అర్హత సాధించారన్నారు. అండర్-14, 17 కబడ్డీ విభాగంలో 13 మంది, అండర్-14, 17 ఖోఖో విభాగంలో 4, అండర్-17 వాలీబాల్ విభాగంలో 6, అండర్-14, 17 షటిల్ విభాగంలో 3, అండర్-14, 17 యోగా విభాగంలో 7, అండర్-17 చెస్ విభాగంలో 1 ఎంపికయ్యారని వివరించారు.



ముసునూరు గురుకుల పాఠశాలలో..

28న నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

నూజివీడు పట్టణం: నూజివీడు నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఈ నెల 28న నిర్వహించనున్నట్లు స్థానిక బాలికల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముసునూరు, నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాలకు చెందిన క్రీడాకారులు అండర్-14, 17 విభాగాల్లో డీఏఆర్ కళాశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు ముసునూరులో స్వర్ణాంధ్ర-2024.. ముసునూరు: స్వర్ణాంధ్ర-2047లో భాగంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లోని ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు వివిధ రకాల పోటీలు శుక్రవారం ఉదయం 11 గంటలకు ముసునూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు గురువారం తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వం, చర్చ కార్యక్రమం వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

స్వీయ సామర్థ్యాలను పెంచుకోవాలి

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: విద్యార్థులు స్వీయ సామర్థ్యాలను పెంచుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుభూషణరావు అన్నారు. గాంధీనగర్ నగరపాలకోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. సెట్‌వెల్ సీఈవో ప్రభాకరరావు పాల్గొన్నారు.

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	దేవర
సత్యనారాయణ మినీ	సరిపోదా శనివారం
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	దేవర
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	మత్తు వదలరా 2
ద్వారక సినిమాస్ స్క్రీన్3	దేవర
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	కళింగ
కైకలూరు	
విజయలక్ష్మి జీ3 సినిమాస్	దేవర
మాగంటి సినిమాస్	చిక్లెట్స్
శ్రీవెంకటరమణ సినిమాస్	దేవర
ముదినేపల్లి: పూర్ణిమ	దేవర